

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 21-05-2026 | సంపుటి - 27 | సంచిక -358 | రూ : 4 | పేజీలు: 8




## క్యూర్‌లో డేటా సిటీ...


- 1,500 ఎకరాల్లో ఏర్పాటు
- హైదరాబాద్ వెలుపలా జీసీసీలు
- పెట్టుబడుల ఆకర్షణకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' ఏజెన్సీ
- హెల్త్‌సిటీకి వైద్య పర్యాటక కేంద్రం తెచ్చేందుకు చొరవ
- ఫ్యూచర్‌సిటీలో ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీసు అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు
- పరిశ్రమల శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో

## దండెత్తిన ఎండ...

- 19 జిల్లాల్లో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు
- అత్యధికంగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో 46.5
- వడదెబ్బతో ఒకే రోజు 11 మంది మృతి
- 25 వరకు వడగాలులు వీస్తాయి: వాతావరణశాఖ
- పగలు బయట తిరగొద్దని ప్రజలకు సూచన

2లో





## పోలీసుశాఖలో అవినీతిని సహించేది లేదు

- పదేళ్ల కాలానికి అనుగుణంగా పోలీసింగ్‌లో మార్పులు
- ఆహార కల్తీ కట్టడికి ప్రత్యేక చట్టం తీసుకొస్తాం
- ఐజీ, ఆపై స్థాయి ఐపీఎస్‌లతో ముఖ్యమంత్రి కీలక సమీక్ష

హైదరాబాద్: పోలీసుశాఖలో అవినీతిని సహించేది లేదని.. శాంతిభద్రతల విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించబోమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. వ్యవస్థలో అందరూ భాగస్వాములు కావాలని.. దాన్ని దాటి వెళ్తామనే అధికారుల విషయంలో ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు. ఐజీ, ఆపై స్థాయి హోదా కలిగిన ఐపీఎస్ అధికారులతో ఎంసీహెచ్ఆర్‌డీలో బుధవారం సీఎం సమీక్ష నిర్వహించారు. సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, భద్రతా సలహాదారు శివధర్‌రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. పోలీసుశాఖలో ఎస్సై నుంచి మొదలు కొని నాన్‌కేడర్ ఐపీఎస్ వరకు పదోన్నతి పొందిన అనంతరం ప్రతి ఒక్కరూ రెండేళ్లపాటు ఇతర విభాగాల్లో పని చేయడాన్ని తప్పనిసరి చేయాలని ఆదేశించారు. ఈ అంశంపై సీఎస్, డీజీపీ అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని సూచించారు. మెరిట్ ప్రకారం పోస్టింగ్‌లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్ల

తరువాయి 2లో



## దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ తీర్చిదిద్దుతాం

2లో

- నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్ పై అధికారులు దృష్టిసారించాలి
- ప్రభుత్వ పాఠశాల పిల్లలను సొంత బిడ్డల్లా భావించి పనిచేయాలి
- ప్రభుత్వ స్కూళ్లలో కనీస మౌలిక సదుపాయాల కోసం స్టార్ రేటింగ్
- డీఈవోలు, ఏపీసీలతో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ సమావేశం

## మెట్రో రెండో దశకు కేంద్రం సానుకూలం



- నిర్మాణ వ్యయంలో సగం భరించేందుకు సిద్ధం
- కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సమావేశం తర్వాత కిషన్‌రెడ్డి వెల్లడి

2లో

దిల్లీ: మెట్రో రెండోదశ ప్రాజెక్టుకు సూత్రప్రాయంగా కేంద్ర

## సాస్కీ కింద రూ.5వేల కోట్లు అందించండి

- విద్యారంగ రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి మినహాయించండి
- కేంద్ర ఆర్థిక మంత్రికి ఉప ముఖ్యమంత్రి భట్టి వినతి

2లో




## చంద్రయాన్ ల్యాండర్ సరికొత్త ఆవిష్కరణ.. రహస్యం దాచిన ఇస్రో!

2లో



- మిషన్ చివర్లో అరమీటర్ పైకి లేచిన ల్యాండర్
- రాకెట్ మంటల ధాటికి కొట్టుకుపోయిన చందమామ పైపొర
- చంద్రుడిపై నేల పొరలుగా ఉందని అంచనా
- మూన్ బేస్ నిర్మాణానికి ఈ డేటా కీలకం



## బండి భగీరథ్‌పై మరో కఠిన సెక్షన్ నమోదు

- కేసు నమోదైన వెంటనే ఫోన్ స్విచ్ఛాఫ్ చేసిన భగీరథ్
- ఫోన్ లోని డేటాను డిలీట్ చేసిన వైనం
- సాక్ష్యాలను ధ్వంసం చేసిన సెక్షన్ జత చేసిన పోలీసులు

2లో

## రోమ్లో మోదీకి 'హంసధ్వని' స్వాగతం

- భారత శాస్త్రీయ సంగీతంతో అలరించిన ఇటలీ కళాకారులు
- 'హంసధ్వని' రాగ ప్రదర్శనపై సోషల్ మీడియాలో ప్రధాని ప్రశంస
- మోదీ తమను ఉత్సాహపరిచా రంటూ కళాకారుల ఆనందం

2లో



# పోలీసుశాఖలో అవినీతిని సహించేది లేదు

హైదరాబాద్: పోలీసుశాఖలో అవినీతిని సహించేది లేదని.. శాంతిభద్రతల విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించబోమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. వ్యవస్థలో అందరూ భాగస్వాములు కావాలని.. దాన్ని దాటి వెళ్తామనే అధికారుల విషయంలో ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు. ఐజీ, ఆపై స్థాయి హోదా కలిగిన ఐపీఎస్ అధికారులతో ఎంసీహెచ్ఆర్‌డీలో బుధవారం సీఎం సమీక్ష నిర్వహించారు. సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, భద్రతా సలహాదారు శివధర్‌రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. పోలీసుశాఖలో ఎస్సై నుంచి మొదలుకొని నాన్‌కేడర్ ఐపీఎస్ వరకు పదోన్నతి పొందిన అనంతరం ప్రతి ఒక్కరూ రెండేళ్లపాటు ఇతర విభాగాల్లో పని చేయడాన్ని తప్పనిసరి చేయాలని ఆదేశించారు. ఈ అంశంపై సీఎస్, డీజీపీ అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని సూచించారు. మెరిట్ ప్రకారం పోస్టింగ్‌లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. శాఖలో అన్ని వాహనాలు ఈవీలకి మారేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్‌ను బలోపేతం చేయడంతోపాటు కాలం చెల్లిన ఆయుధాలను తొలగించాల్సిన అవసరముందన్నారు. కొత్త సవాళ్లకు అనుగుణంగా.. వచ్చే పదేళ్ల కాలానికి తగిన రీతిలో పోలీసింగ్‌లో మార్పులు చేపట్టాలని ఆదేశించారు. ఎఫ్ఎస్ఎల్ విభాగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. సీసీ కెమెరాలను పెంచుకోవడంతోపాటు కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మరింత సమర్థంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అన్ని ఠాణాల్లో ఫిర్యాదుల కోసం క్యూఆర్ కోడ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆహార కల్తీ కారణంగా క్యాన్సర్ కేసులు ఆందోళనకరంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. మాదకద్రవ్యాల బారిన పడిన బాధితుల కోసం ప్రత్యేక డీ ఎడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

**సైబర్‌క్రైమ్‌పై శిక్షణ.. విజిలెన్స్ బలోపేతం**

సైబర్‌క్రైమ్ నియంత్రణపై అధ్యయనం చేసి కార్యాచరణ రూపొందించాలని సీఎం అధికారులకు సూచించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ శిక్షణలోనే సైబర్‌క్రైం విభాగంలో పనిచేయడం కోసం ఎంపిక చేపట్టాలన్నారు. సైబర్‌క్రైమ్ శిక్షణపై పోలీస్ విభాగం కోసం స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక కోర్సు ఏర్పాటు చేయాలని సూచించారు. విజిలెన్స్ విభాగాన్ని సాంకేతికంగా బలోపేతం చేయాలన్నారు. డేటా విశ్లేషణ ఆధారంగా వ్యవస్థీకృత నేరాలపైన విజిలెన్స్ విభాగం దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలు జరిగిన తర్వాత కాకుండా ముందస్తుగా నియంత్రణపై అగ్నిమాపకశాఖ దృష్టి సారించాలని సూచించారు. ఇందుకు సంబంధించి పురపాలకశాఖ, హైడ్రాతో సమన్వయం చేసుకొని అగ్నిమాపకశాఖ వచ్చే నెల 15లోగా నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున మ్యాన్‌హోల్స్, నాలాల నిర్వహణ అంశంలో పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, పురపాలకశాఖలతో జలమండలి సమన్వయం చేసుకోవాలని సూచించారు. రాజధానిలో ఫ్లెక్సీలపై పోలీస్, జీహెచ్ఎంసీ అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. పోలీసులు రాత్రివేళల్లో గస్తీని మరింత పెంచాలన్నారు.

# రోమ్ లో మోదీకి 'హంసధ్వని' స్వాగతం

ప్రధాని నరేంద్ర మోదీ తన ఇటలీ పర్యటనలో భాగంగా రోమ్‌లో అరుదైన అనుభూతిని పొందారు. అక్కడ తనకు స్వాగతం పలికేందుకు ఐదుగురు ఇటలీ కళాకారులు భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. వారి ప్రదర్శనపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పంచుకున్నారు. "ఇటలీలో భారతీయ సంగీతానికి ఆదరణ బాగా పెరుగుతోంది. రోమ్‌లో జరిగిన స్వాగత కార్యక్రమంలో ఐదుగురు ఇటలీ కళాకారులు 'హంసధ్వని' రాగాన్ని అద్భుతంగా వినిపించారు" అని మోదీ పేర్కొన్నారు. వాలెరియో బ్రూనీ (సంతూర్), లియో వెర్టూనీ (సితార్), సిమోన్ మట్టిఎల్లో (బాన్సురీ), ఫ్రాన్సెస్కో ఘెరార్డీ (తబలా), నికోలో మెల్లోచి (బాన్సురీ)లకు ఆయన అభినందనలు తెలిపారు. కర్ణాటక, హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంలో 'హంసధ్వని' రాగానికి ప్రత్యేక స్థానం ఉంది. దీనిని 18వ శతాబ్దంలో రామస్వామి దీక్షితార్ స్వరపరిచారు. సంగీత కచేరీల ప్రారంభంలో ఈ రాగాన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. ప్రధాని మోదీని కలవడంపై ఇటలీ కళాకారులు కూడా సంతోషం వ్యక్తం చేశారు. ప్రదర్శన సమయంలో మోదీ చప్పట్లు కొడుతూ తమను ఉత్సాహపరిచారని, ఆయన తమతో కనెక్ట్ అయ్యారని కళాకారులు తెలిపారు. తాము ఆయనతో కరచాలనం చేసి, ఫోటోలు కూడా దిగామని తబలా కళాకారుడు ఫ్రాన్సెస్కో ఘెరార్డీ అన్నారు. ప్రధాని ముందు ప్రదర్శన ఇవ్వడం గొప్ప అవకాశమని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ చివరిగా మంగళవారం రోమ్ చేరుకున్నారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోని ఆయనకు సాదర స్వాగతం పలికారు.

# సాస్కీ కింద రూ.5వేల కోట్లు అందించండి

ఢిల్లీ: రాష్ట్రంలో మౌలిక వసతుల విస్తరణకు అవసరమైన మూలధన వ్యయం కోసం కేంద్ర ప్రభుత్వం సాస్కీ (స్కీమ్ ఫర్ స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) కింద తెలంగాణకు అదనంగా రూ.5వేల కోట్లు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. రాష్ట్రానికి సంబంధించి వివిధ అంశాలపై కేంద్ర మంత్రులను కలవడానికి దిల్లీకొచ్చిన ఆయన బుధవారం నిర్మలా సీతారామన్, కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డిని వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. "రాష్ట్రంలో చేపట్టే అభివృద్ధి పనులకు అవసరమైన మూలధన వ్యయం కోసం సాస్కీ కింద రాష్ట్రాలకు 50 ఏళ్ల పాటు వడ్డీ లేని రుణం అందించడం మంచి నిర్ణయం.ఈ పథకం కింద 2025 26లో తెలంగాణకు ఇప్పటికే రూ.4,208 కోట్లు మంజూరు చేశారు. ఇప్పుడు దానికి అదనంగా మరో రూ.5వేల కోట్లు ఇవ్వండి. విద్యారంగంలో సమూల మార్పులు తేవడానికి రూ.21 వేల కోట్లతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం, మరో రూ.9వేల కోట్లతో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలల నిర్మాణం, డిజిటల్ మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని సంకల్పించాం. ఇందుకు ఆసియా అభివృద్ధి బ్యాంకు ద్వారా రూ.4,049.11 కోట్లు, ఏఐఐబీ ద్వారా రూ.4,903.44 కోట్ల ఆర్థిక వనరుల సమీకరణకు కేంద్రం ఆమోదం తెలిపినందుకు ధన్యవాదాలు.అయితే ఈ రెండు రుణాలను భవిష్యత్తు తరాల మానవ వనరుల అభివృద్ధికి ఉపయోగిస్తున్నందున మూలధన వ్యయంగా పరిగణించి ఎఫ్ఆర్‌బీఎం నుంచి మినహాయించాలి'' అని నిర్మలా సీతారామన్‌కు భట్టి విన్నవించారు.

# బండి భగీరథ్‌పై మరో కఠిన సెక్షన్ నమోదు

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్ కీలక సాక్ష్యాలను మాయం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నెల 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన వెంటనే ఫోన్ స్విచ్చాఫ్ చేసిన నిందితుడు, పరారీలో ఉన్న సమయంలో పథకం ప్రకారం తన అత్యాధునిక ఐఫోన్‌లోని డేటాను, కీలక వీడియోలను డిలీట్ చేయడమే కాకుండా, సోషల్ మీడియా అకౌంట్లను కూడా మాయం చేశాడు. అరెస్ట్ అనంతరం పోలీసులు ఫోన్‌ను స్వాధీనం చేసుకోగా, అందులో సిమ్ కార్డ్ లేకపోవడం, ఫోన్ ఖాళీగా ఉండటంతో.. సాక్ష్యాలను ధ్వంసం చేసిన నేరం కింద పోలీసులు ఈ కేసులో అదనంగా బీఎన్ఎస్ సెక్షన్ 238ను (గతంలో ఐపీసీ 201) జోడించారు. చట్టం నుంచి తప్పించుకోవడానికి ఫోన్‌ను పలుమార్లు ఫార్మాట్ చేసినట్లు అనుమానిస్తున్న పోలీసులు, నిందితుడి కంటే వంద రెట్లు పవర్‌ఫుల్ టెక్నాలజీతో ఉచ్చు బిగించేందుకు సిద్ధమయ్యారు. ఐఫోన్ సెక్యూరిటీ ఫీచర్లు కఠినంగా ఉన్నప్పటికీ, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (FSL) నిపుణుల వద్ద ఉన్న 'సెలెబ్రైట్' వంటి అంతర్జాతీయ స్థాయి అడ్వాన్స్‌డ్ సాఫ్ట్‌వేర్ల ద్వారా డిలీట్ అయిన చాటింగ్, వీడియోలు, ఫొటోలను రికవరీ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఒకవేళ ఐఫోన్ అంతర్గత మెమొరీని పూర్తిగా ఫ్యాక్టరీ రీసెట్ చేసినా, ఐక్లౌడ్ బ్యాకప్ సర్వర్ల నుండి డేటాను సేకరించేందుకు, అవసరమైతే కోర్టు ద్వారా యాపిల్ సంస్థను సంప్రదించేందుకు సైతం సిద్ధమవుతున్నారు. వీటితో పాటు, నిందితుడు ఫోన్ స్విచ్చాఫ్ కావడానికి ముందు ఎక్కడ ఉన్నాడు, ఎవరితో మాట్లాడాడు, ఆశ్రయం కల్పించిన తెరవెనుక సూత్రధారులు ఎవరు అనే వివరాల కోసం సెల్ టవర్ మ్యాపింగ్, కాల్ డేటా రికార్డులను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ సాంకేతిక ప్రక్రియల్లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే, కేసును పటిష్టంగా కోర్టు ముందు నిలబెట్టేందుకు పోలీసులు 'ప్లాన్ బి'ని కూడా సిద్ధం చేసుకున్నారు. ఇందులో భాగంగా బాధితురాలి ఫోన్‌ను మరో కీలక సాక్ష్యంగా మార్చనున్నారు. నిందితుడు బాధితురాలికి పంపిన బెదిరింపు సందేశాలు, ఫొటోలు, వీడియోలను 'రిసీవ్డ్ డేటా' రూపంలో సేకరించి, వాటిని ధ్రువీకరించి కోర్టు ముందు ఉంచనున్నారు. పోక్సో కేసులో సాక్ష్యాల తారుమారుకు ప్రయత్నించడం నేర తీవ్రతను మరింత పెంచుతుందని చట్టపరమైన నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# చంద్రయాన్ ల్యాండర్ సరికొత్త ఆవిష్కరణ..
# రహస్యం దాచిన ఇస్రో!

భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్3 మిషన్ ముగిసినా సరికొత్త అద్భుతాలను బయటపెడుతూనే ఉంది. 'శివశక్తి పాయింట్' వద్ద విక్రమ్ ల్యాండర్ చేసిన ఒక చిన్న ప్రయోగం ఇప్పుడు శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరుస్తోంది. జాబిల్లి నేల గురించి అంతర్జాతీయ అంతరిక్ష సంస్థ నాసా సైతం అబ్బురపడే విషయాలు ఇస్రో ద్వారా వెలుగులోకి వచ్చాయి.

**అనుకోకుండా చిన్న జంప్**

చంద్రయాన్3 ల్యాండర్ విక్రమ్ తన ప్రయోగాలు పూర్తి చేసుకునే సమయానికి దానిలో కొంత ఇంధనం మిగిలింది. దీంతో ఇస్రో శాస్త్రవేత్తలు ముందుగా ప్లాన్ చేయని ఒక సాహసం చేశారు. ఇంజిన్లను మళ్లీ మండించి విక్రమ్‌ను చంద్రుడి ఉపరితలం నుంచి 50 సెంటీమీటర్ల పైకి లేపి పక్కకు కాస్త దూరంలో ల్యాండ్ అయ్యేలా చేశారు. టెక్నాలజీ పరంగా ఇది భారత్‌కు ఒక పెద్ద విజయమైనా సైంటిఫిక్‌గా అంతకంటే పెద్ద రహస్యం దీనివల్ల బయటపడింది.

**కొట్టుకుపోయిన పైపొర**

ల్యాండర్ ఇంజిన్లు మళ్లీ మండటంతో ఆ మంటల ధాటికి చంద్రుడిపై ఉన్న 3 సెంటీమీటర్ల పైపొర గాల్లోకి లేచింది. పైన ఎంతో మెత్తగా, దూదిలా ఉండే పొడి మట్టి తొలగిపోవడంతో..దాని కింద ఎప్పుడూ ఎండ తగలని సరికొత్త మట్టి పొరలు ల్యాండర్‌లోని చాస్టే పరికరానికి చిక్కాయి. ఇలా ఎలాంటి డ్రిల్లింగ్ మిషన్ లేకుండానే చంద్రుడి అంతర్భాగంలో ఉన్న మట్టిని పరిశీలించే అరుదైన అవకాశం శాస్త్రవేత్తలకు దొరికింది.

# క్యూర్‌లో డేటా సిటీ

హైదరాబాద్: హైదరాబాద్ వెలుపలా జీసీసీ(గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)ల ఏర్పాటుకు కంపెనీలకు ప్రోత్సాహం అందించేలా ప్రత్యేక పాలసీ రూపొందించాలని, జిల్లాలకూ ఐటీ వెలుగులు విస్తరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు, పెట్టుబడిదారులకు సహకరించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరిట ప్రత్యేక ఏజెన్సీని ప్రారంభించాలని స్పష్టంచేశారు. బుధవారం ఐటీ, పరిశ్రమల శాఖలపై సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ''ఐటీ, ఇతర ఉద్యోగ అవకాశాలు హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించాలి. కోర్ అర్బన్ రీజియన్ ప్రాంతాల్లో ఐటీ, డేటా సెంటర్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. అందులో భాగంగా 1,500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించండి. డేటా సిటీ కోసం ఎస్టీపీలలో శుద్ధి చేసిన నీటిని తీసుకోవాలి. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, విజయవాడహైదరాబాద్ హైవేల వెంట జీసీసీలు, డేటా సెంటర్లు ఏర్పాటు చేసే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలి. వాటి ఏర్పాటుకు ఆయా నగరాల ప్రధాన రహదారుల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించండి.

**ఫ్యూచర్ సిటీలో నెట్‌జీరో విధానాలు**

భారత్ ఫ్యూచర్ సిటీ(బీఎఫ్‌సీ)లో ప్రపంచస్థాయి మౌలిక వసతులతోపాటు పర్యావరణహిత నెట్‌జీరో విధానాలను అమలు చేయాలి. ఏఐ, హెల్త్ సిటీలు, ఇండస్ట్రియల్ కారిడార్ పనులను వేగవంతం చేయాలి. ప్రతిపాదిత ఏఐ సిటీ పనులను వెంటనే ప్రారంభించండి. అందులో మౌలిక వసతుల కల్పన ప్రపంచ స్థాయిలో ఉండేలా అంతర్జాతీయ నగరాలను అధ్యయనం చేయండి. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేసిన తర్వాతే భూకేటాయింపులు చేపట్టండి. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించిన ఐదు ప్రాంతీయ వైద్య పర్యాటక కేంద్రాల్లో ఒకదాన్ని ఫ్యూచర్ సిటీలోని హెల్త్ సిటీలో ఏర్పాటు చేసేలా కేంద్రంతో చర్చించండి. అవసరమైతే ప్రధాని మోదీతో నేను మాట్లాడతా. ఫ్యూచర్ సిటీలోని పారిశ్రామికవాడలో వివిధ కంపెనీల ప్రాంగణాల్లో త్వరలో భూమిపూజలు చేయడానికి అవసరమైన పనులు చేపట్టాలి. ఇక్కడ స్థాపించే కంపెనీలన్నీ యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపు కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో ఒప్పందాలు కుదుర్చుకునేలా చూడాలి. ఫ్యూచర్‌సిటీలో ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీసు అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించనున్నాం.

**పెట్టుబడిదారుల కోసం ప్రత్యేక వ్యవస్థ**

రాష్ట్రానికి భారీ పెట్టుబడులను రప్పించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరిట ఒక ప్రత్యేక ఏజెన్సీ ప్రారంభించాలి. పెట్టుబడిదారులకు ఒకే వేదికపై అన్ని అనుమతులు, సేవలు అందించేందుకు ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను రూపొందించాలి. దీనికి గ్రూప్1 స్థాయి అధికారిని నియమించే అంశాన్ని పరిశీలించాలి. ఐటీ, పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో ఉండే ఇన్వెస్ట్ తెలంగాణ ఏజెన్సీలోకి విద్యుత్, ఆర్థిక వంటి శాఖల అధికారులు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉండాలి. ఈ ఏజెన్సీ విధివిధానాల రూపకల్పనకు ముందు తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయండి. ఇతర రాష్ట్రాల్లోనూ అమలులో ఉన్న ఉత్తమ విధానాలను తీసుకోండి'' అని సూచించారు. అలాగే... రానున్న మూడు నెలల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు టీ ఫైబర్ ఇంటర్నెట్‌ను వినియోగించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే టీఫైబర్‌కు మారిన ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.54 కోట్ల ఆర్డర్లు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణారావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ వీసీఅండ్‌ఎండీ శశాంక, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో రెండో దశకు కేంద్రం సానుకూలం

ఢిల్లీ: మెట్రో రెండోదశ ప్రాజెక్టుకు సూత్రప్రాయంగా కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేదని, నిర్మాణ వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తి భరించే ప్రాతిపదికన ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. హైదరాబాద్‌కు సంబంధించిన వివిధ కీలక పట్టణాభివృద్ధి ప్రాజెక్టులపై కిషన్‌రెడ్డి బుధవారం ఉదయం దిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను ఆయన నివాసంలో కలిసి చర్చించారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. ''హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టు గురించి ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఎల్అండ్‌టీ సంస్థ నుంచి మొదటిదశ ప్రాజెక్టును టేకోవర్ చేసుకున్న నేపథ్యంలో మిగిలిన రెండో దశ పనులకు సంబంధించిన డీపీఆర్, ఇతర సాంకేతిక వివరాలు అందిన తర్వాత సమగ్రంగా పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని ఖట్టర్ హామీ ఇచ్చారు. మెట్రో రెండో దశ విషయంలో సూత్రప్రాయంగా కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేదని, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో ఖర్చు చేసే ప్రాతిపదికన ముందుకెళ్లేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. మెట్రో రెండో దశకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 162 కిలోమీటర్ల పనులకు సంబంధించి ప్రతిపాదనలు సమర్పించిందని, వాటిని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తదుపరి చర్యలు చేపడుతుందన్నారు.

# దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ తీర్చిదిద్దుతాం

"దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ ఉండాలన్నది నా ధ్యేయం. అందుకు అనుగుణంగా విద్యావ్యవస్థను తీర్చిదిద్దేందుకు కృతనిశ్చయంతో ఉన్నాను. అంతర్జాతీయస్థాయి అత్యుత్తమ బోధనా పద్ధతులపై అధ్యయనానికి ఉపాధ్యాయులను విదేశాలకు పంపుతున్నాం. అక్కడ వారు తెలుసుకున్న మంచి బోధనాపద్ధతులను రాష్ట్రంలో అమలు చేస్తాం" అని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. అమరావతి సచివాలయంలో రాష్ట్రవ్యాప్తంగా డీఈవోలు, ఏపీసీలతో(అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్స్) మంత్రి సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, క్వాలిటీ మెరుగుపర్చకపోతే నష్టపోయేది పిల్లలే అన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థ ఓపెన్ మార్కెట్‌తో పోటీపడాలన్నారు. ఇందుకోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వరల్డ్ క్లాస్ బెస్ట్ మోడల్ ఆఫ్ పబ్లిక్ స్కూల్ ఎడ్యుకేషన్ తన లక్ష్యమని, ఇందుకోసం అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

# దండెత్తిన ఎండ

హైదరాబాద్ : భానుడి భగభగలకు రాష్ట్రం అట్టుడుకుతోంది. అధిక వేడితో కూడిన వడగాలులకు ప్రజలు హడలెత్తిపోతున్నారు. బుధవారం రాష్ట్రంలో అత్యధికంగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో 46.5, తర్వాత హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌లో 46.4, కరీంనగర్ జిల్లా చొప్పదండిలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. మొత్తం 33 జిల్లాల్లోనూ 40.5 డిగ్రీలకన్నా ఎక్కువగా ఉన్నాయి. అత్యల్పంగా వనపర్తి జిల్లా చిన్నంబావి గ్రామంలో 40.5 డిగ్రీలుంది. అత్యవసర పనుల కోసం బయటకు వెళ్లిన వారు వడదెబ్బకు గురవుతున్నారు. బుధవారం ఒక్కరోజే ఇలా వడదెబ్బ బారిన పడి 11 మంది మృతిచెందారు. వీరిలో రైతులు, ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

**పలుచోట్ల పదేళ్ల రికార్డులు తుడిచేసి..**

భానుడి ఉగ్రరూపంతో పలుచోట్ల గత పదేళ్ల మే నెల రికార్డులు తుడిచిపెట్టుకుపోయాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పదేళ్ల మే నెలలో అత్యధిక ఉష్ణోగ్రత రికార్డు 2019 మే 24, 29, 30 తేదీల్లో 46.3 డిగ్రీలుండగా బుధవారం అది చెరిగిపోయి దిలావర్‌పూర్‌లో 46.5 డిగ్రీలు నమోదైంది. అలాగే హనుమకొండలో గత పదేళ్ల రికార్డు 2017 మే 22, 23 తేదీల్లో 45 డిగ్రీలుంటే తాజాగా 46.4 డిగ్రీలతో కొత్త రికార్డు నమోదైంది. కుమురం భీం ఆసిఫాబాద్, జనగామ జిల్లాల్లో తీవ్ర వడగాలులు, ఇతర జిల్లాల్లో వడగాలులు వీచినట్లు వాతావరణశాఖ తెలిపింది. సాధారణంకన్నా 6.5 డిగ్రీలకు మించి అదనంగా ఉష్ణోగ్రతలుంటే తీవ్ర వడగాలులు, 4.5 డిగ్రీలకు మించి అదనంగా ఉంటే వడగాలులు వీస్తున్నట్లు వాతావరణశాఖ ప్రకటిస్తుంది. గురువారం నుంచి 25 దాకా రాష్ట్రంలో పలుచోట్ల వడగాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసింది. పగలు ఎండవేడి సమయంలో బయట తిరగరాదని ప్రజలకు సూచించింది. అలాగే ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో అత్యధికంగా 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

# చరిత్ర పరిరక్షణ అందరి బాధ్యత: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

* హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్.



జనగామ / లింగాల ఘణపురం, ప్రజా స్పూర్తి : జిల్లా లోని చారిత్రక సంపద, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాల కు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహిస్తున్న "పర్యాటక వారోత్సవాల" సందర్భంగా మండలం లోని జీడికల్ గ్రామ చౌరస్తా నుంచి అతి పురాతన మైన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయం వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని పర్యాటక ప్రాంతాల ప్రాధాన్యత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో ఉన్న చారిత్రక, పర్యాటక ప్రదేశాలు యువతను, పర్యాటకులను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయా లన్నారు. జిల్లా కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చే వారసత్వ కట్టడాలను సంరక్షిస్తూ వాటి చరిత్రను భావితరా లకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. రెండో భద్రాద్రిగా పేరొందిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆల యాన్ని కలెక్టర్ సందర్శించారు. ఆలయ పూజారులు వేద మంత్రోచ్చారణలతో ఆయనకు స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం పూజారులు వేద ఆశీర్వచనం అందజేశారు. తదుపరి టూరిజం గైడ్‌కు సంబంధించిన పోస్టర్ ను కలెక్టర్, అధికారులు, ఆలయ చైర్మన్, పూజారులు కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో టూరిజం అధికారి నర్సింహా రావు, ఎంపీడీఓ, జీసీడీఓ, గ్రామ సర్పంచ్ కొండబోయిన మమత , ఆలయ చైర్మన్ ఏలే నర్సింహా మూర్తి, ఈ.ఓ చిందం వంశీ, టీఎస్ఎస్ కళాకారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. తదనంతరం గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి కొను గోలు ప్రక్రియని నిశితంగా పరిశీలించా రు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు కేంద్రంలో జరిగిన కొనుగోలు వివరాలు, రిజిస్టర్ నిర్వహణ, ట్యాబ్ ఎంట్రీ, లోడిం గ్, అన్ లోడింగ్ ఎలా అవుతుందని కలెక్టర్ ఆరా తీశారు. కేంద్ర నిర్వాహకు లకు కలెక్టర్ పలు సూచనలు చేసారు. ప్రతీ బస్తా 41 కేజీలు మాత్రమే ఉండా లని, ఎక్కువ తూకం వేయకూడదని, కాంట ప్రక్రియ త్వరగా కావాలని, సరిపడా హమాలీలను పెట్టుకొని కొనుగోలు అయిన ధాన్యం త్వరగా మిల్ లకు తరలించాలన్నారు. ట్రక్ తో కేంద్రానికి సంబందించిన ఎవరో ఒకరు తప్పకుండ వెళ్లి ఆన్ లోడింగ్ త్వరగా అయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు చేస్తే రైతుల ఖాతా లో నగదు జమ ఆలస్యం కాదన్నారు.

## అర్హులైన గిరిజనులందరికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

* బి ఆర్ ఎస్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు సందీప్ నాయక్



గరిడేపల్లి ప్రజావాణి : గరిడేపల్లి మండల పరిధిలో ఉన్న అన్ని గిరిజన తండాలలో అర్హులైన పేద గిరిజనులను గుర్తించి గిరిజనులందరికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని బిఆర్ఎస్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు గుగులోతు సందీప్ నాయక్ అన్నారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి దాదాపు రెండున్నర సంవత్సరాలు అయిందని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కాల యపనం చేస్తున్నారని మండలంలో పేద గిరిజనులను గుర్తించి తక్షణమే అన్ని తండా లలో ప్రతి తండాకి 300 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి గిరిజనులకు న్యాయం చేయాలని వారు అన్నారు ఎటువంటి రాజకీయ విభేదాలు లేకుండా అర్హులను గుర్తించి ఇండ్లు కేటాయించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులుగిరిజన నాయకులు సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కూసుమంచి మండలంలో ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలు



కూసుమంచి, ప్రజా స్పూర్తి: కూసుమంచి మండల కేంద్రంలో జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో బుధవారం పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.కేక్ కట్ చేసి స్విట్లు పంపిణి చేశారు అనంతరం ప్రజలకు మజ్జిగ పంపిణి చేశారు జూనియర్ ఎన్టీఆర్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐతగాని నవీన్, ఆడేపు శివ, తహీరూ హుస్సెన్, సతీష్, ఉదయ్, సాయి, నాగరాజు, రామకృష్ణ, వినయ్, ఫ్యాన్స్ పాల్గొన్నారు.

## ఘనంగా మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ జన్మదిన వేడుకలు



మహబూబాబాద్, ప్రజాస్పూర్తి : మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ జన్మదిన వేడుకలు శంకర్ నాయక్ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు తెల్ల శ్రీనివాస్, నాయిని రంజిత్ రెడ్డి, ఎండి ఫరీద్, కత్తుల ఎలేందర్, బాలు నాయక్,ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు,జిల్లా నాయకులు, మండల నాయకులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ వార్డు కౌన్సిలర్లు, వార్డ్ కౌన్సిలర్, పెద్ద ఎత్తున జన్మదిన వేడుకలు నిర్వహించారు. తదనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ అభిమానులు, పార్టీ కార్యకర్తలు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వెలిదండలో ఉపాధి హామీ కూలీలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ



గరిడేపల్లి, ప్రజాస్పూర్తి : గరిడేపల్లి మండలంలోని వెలిగెండ గ్రామ ప్రజల , ఉపాధి హామీ కూలీల సంక్షేమమే మా ప్రధాన లక్ష్యమని వెలిదండ గ్రామ సర్పంచ్ చెన్నగాని సాంబయ్య అన్నారు. గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, సర్పంచ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ చెన్నగాని సాంబయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ఈ వేసవి కాలంలో ఉపాధి హామీ కూలీలు ఎండ దెబ్బకు గురికాకుండా, డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండేందుకే ఈ ఓ ఆర్ ఎస్ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కూలీలు పని ప్రదేశంలో తగినంత నీరు తాగుతూ, తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రానున్న రోజుల్లో కూడా కూలీలకు అవసరమైన అన్నిసహాయ సహకారాలను గ్రామ పంచాయతీ తరపున అందిస్తాం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నాగేంద్రబాబు, స్థానిక వార్డు సభ్యులు, ఆశా వర్కర్లు, గ్రామ ఉపాధి హామీ సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధులు మెట్లు , ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



ప్రజాస్పూర్తి , జన్నారం : మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఇందులో భాగంగా జన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ గోడౌన్, మొర్రిగూడలోని రాఘవేంద్ర రైస్ మిల్ గోడౌన్, చింతగూడ లోని ప్యాక్స్ కేంద్రాన్ని పరిశీలించారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.తేమ శాతం, తూకం, గన్నీ బ్యాగులు, రవాణా విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు.ఆయన వెంట తహసీల్దార్ జి. బక్కయ్య, ఎంపీడీఓ ఉమర్ షరీఫ్, ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ



మహబూబాబాద్,ప్రజాస్పూర్తి :సిరోలు మండలం, మన్నెగూడెం, మరిపెడ లలో ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ (ప్యాక్స్) ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్రాలలో ఇప్పటివరకు వచ్చిన ధాన్యం వివరాలు ప్రస్తుతం నిల్వ ఉన్న వివరాలు మిల్లులకు గోదాములకు పంపిన ధాన్యం వివరాల ఇన్వార్డ్ అవుట్ వార్డు రిజిస్టర్ ను, ట్యాబెట్ ఎంట్రీ, మాస్టర్ రైతులు , వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు,ఇప్పటికే మక్క జొన్న, ధాన్యం కొనుగోళ్ల లో ప్రత్యేక అధికారులు, తహసీల్దారులను నియమించడం జరిగిందని వారి పర్యవేక్షణలో ప్రతి ఒక్కరు ఒక కేంద్రానికి నిబద్ధత కలిగిన అధికారిని నియమించి ప్రతినిత్యం కొనుగోలు రవాణా విషయాలలో వేగంగా పనిచేస్తూ లక్ష్యాలను చేరుకునే దిశగా ఉన్నారని అదే స్పూర్తితో ముందుకు సాగాలన్నారు. రైతులకు ఇబ్బంది కలిగే విధంగా ఎవరూ ప్రవర్తించకూడదని, కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఉండాలని, గన్నీ సంచులు, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలని, లోడింగ్ అన్లోడింగ్ లో వేగం పెంచాలని, సాధ్యమైనంత త్వరగా స్థానిక వాహనాలను హమాలీలను సమకూర్చుకొని ధాన్యాన్ని తరలించాలన్నారు. జిల్లాలో సరిపడంతా ప్రదేశాలు మిల్లులు, గోదాములలో ఉందని లారీ కాంట్రాక్టర్స్ ఆ దిశగా తరలించాలని సూచించారు. ఈ పర్యటన లో డిఆర్డిఓ ప్రాజెక్ట్ అధికారి మధుసూదన రాజు, జిల్లా సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, పౌరసరఫరాల శాఖ అధికారి రమేష్, డిస్టిక్ మేనేజర్ నరసింహారావు, సిరోలు, మరిపెడ మండలాల తహసిల్దార్లు కృష్ణవేణి, పున్నం చందర్, తదితరులు ఉన్నారు

## పెంచిన ఎరువులు పెట్రోలు వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

* సీపీఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ పాలేరు డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకటరామిరెడ్డి




కూసుమంచి, ప్రజా స్పూర్తి: కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎరువులు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని పాలేరు డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకటరామిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పెంపు వల్ల ఈ దేశంలో ఉన్నటువంటి కార్మికులు కర్షకులు ప్రజలపై కోట్లాది రూపాయలు భారం పడి దివాలా తీసే పరిస్థితి వస్తుందన్నారు. కేంద్రం గత 12 సంవత్సరాలలో కార్పొరేట్ల అనుకూల విధానాలు అవలంబిస్తూ ప్రజల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. భారతదేశ మిత్ర దేశమైన ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా వేస్తున్న అప్రజా స్వామికదాడిని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశ అధినేత మోడీ ఖండించపోవటం శోచనీయమన్నారు. పంటలకు మద్దతు ధర రూపాయలలో పెంచి ఎరువుల ధరలువందలో పెంచి . కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల తన చిత్తశుద్ధిని నిరూపించింది అన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని పేపర్ లీకు జేసి 23 లక్షల దిమంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుగు కండిషన్లు లేకుండా మొక్కజొన్న వరిని కొనుగోలు చేయాలన్నారు. ఒకపక్క వర్షాలకు రైతులు టెన్షన్ కి గురై మధ్య దళారీలకు సగం రేట్ కి అమ్ముతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కూసుమంచి సబ్ డివిజన్ కార్యదర్శి ఐ వెంకన్న, కే సురేష్, చెరుకుపల్లి వీరయ్య, బుర్ర సైదులు బత్తుల ఉప్పలయ్య, నిమ్మల వెంకన్న,దాట్ల వీరస్వామి పోకల వెంకన్న,ఆర్ సంజీవరావు,పి ఓ డబ్ల్యు జిల్లా నాయకురాలు కే కల్పన, తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచ పోలీస్ స్టేషన్ సందర్శించిన జిల్లా ఎస్పీ



ప్రజాస్పూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పలు సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేసే అధికారులు, సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్పీ వెంట పాల్వంచ సీఐ సతీష్ కుమార్, ఎస్సైలు టి.నాగరాజు, జి.విజయ, సిబ్బంది ఉన్నారు.

## ఉత్తర తెలంగాణలో వడగాలులు.. పలుచోట్ల వర్షాలు.. హెచ్చరించిన ఐఎండీ..!

హైదరాబాద్:తెలంగాణలో రాగల రెండులు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఓ వైపు రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్న విషయం తెలిసిందే. అదే సమయంలో రాబోయే రెండురోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశాలున్నాయని వాతావరణశాఖ పేర్కొంది. పలుచోట్ల వడగాలులు వీస్తాయని తెలిపింది. బుధవారం వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. అలాగే, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాలో వడగాలులు వీస్తాయని హెచ్చరించింది. గురువారం వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, కరీంనగర్, పెద్దపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి భువనగిరిలో వడగాలులు కొనసాగుతాయని చెప్పింది. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీస్తాయని వివరించింది. శని, ఆదివారాల్లో మంచిర్యాల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో పలుచోట్ల వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

## చెరువుల పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన

: ఎం.పీ చామల



జనగామ,ప్రజాస్పూర్తి : జిల్లా కేంద్రం లో బుధవారం పర్య టించి పలు అభివృద్ధి కార్యక్రమా ల్లో పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా పట్టణంలోని రెండవ వార్డులో అమృత్ పథకం కింద చేపట్టనున్న లేక్ రీజనరేషన్ ( చెరువుల పునరుద్ధరణ) పనుల కు శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఎంపీ మాట్లాడుతూ చెరు వుల అభివృద్ధితో పాటు పర్యా వరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంద న్నా రు. పట్టణ అభివృద్ధికి అవసర మైన మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ఎంపీ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 18 సంవత్సరాల నిండిన ప్రతి గౌడ బిడ్డకి లైసెన్స్ ఇవ్వాలి




మహబూబాబాద్, ప్రజా స్పూర్తి: జూన్ 2న తెలంగాణ వ్యాప్తంగా కొత్త పెన్షన్లు ఇస్తున్న సందర్భంగా ప్రతి గౌడ బిడ్డకి, గౌడ కుల సర్టిఫికెట్ ను పరిగణనలోకి తీసుకొని ప్రతి ఒక్కరికి లైసెన్స్ ఇవ్వాలని జై గౌడ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గుదే వీరన్న గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ బిడ్డ పుట్టుకతోనే గౌడ కాబట్టి తాటిచెట్టు ఎక్కిన వాళ్ళకి కాకుండా, గౌడ కుల సర్టిఫికెట్ ఉన్న అందరికి కూడా లైసెన్స్ ఇవ్వాలి. 50 సంవత్సరాలు పైబడి లైసెన్స్ లేని వారికి కూడా పెన్షన్కు అవకాశం కల్పించాలి. దీనిని ప్రభుత్వ పరిశీలించి ప్రతి గౌడ బిడ్డకు లైసెన్సులు,పెన్షన్లు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. మహబూబాబాద్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో గౌడ కమ్యూనిటీ హాల్,గౌడ హాస్టల్ నిర్మించాలి. గౌడల అభ్యున్నతి కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుచున్నాము.

## పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచడం దారుణం

* ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య



ప్రజాస్పూర్తి, కొత్తగూడెం: పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ప్రజల ఆందోళన చేస్తుండగా మళ్లీ ధరలు పెంచడం దారుణమని ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక శేషగిరి భవన్‌లో జరిగిన పట్టణ సమితి సమావేశంలో ఆయన తో పాటు , ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మర్రి కృష్ణ పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే పెరిగిన నిత్యవసర వస్తువు ధరలతో ఇబ్బందులు పడుతున్న సామాన్యులు తాజాగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుదలతో మరింత భారం పెరిగిందని అన్నారు. ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మీ పథకంతో ఆటో డ్రైవర్ల ఆదాయంపై గండి కొట్టిందని, ఇంతలోనే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచడం దారుణమని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకే ఊడిగం చేస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరిస్తుందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని పిలుపునిచ్చారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

## ద్విచక్ర వాహన అదుపు తప్పి డిసిపి గన్మెన్ కు తీవ్ర గాయాలు



ప్రజాస్పూర్తి , జన్నారం : ద్విచక్ర వాహనం అదుపుతప్పి డిసిపి గన్ మెన్ కు తీవ్ర గాయాలకు గురయ్యాడు. వివరాల ప్రకారం... లక్షపేట మండలం వెంకట్రావు పేట కు చెందిన కోడిజుట్టు శ్రీనివాస్ మంచిర్యాల డిసిపి భాస్కర్ గన్ మెన్ ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. తను జన్నారం మండలం పొనకల్ గ్రామంలోని తన బంధువుల ఇంటికి శుభకార్యానికి వచ్చాడు. బుధవారం సాయంత్రం తిరిగి ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు వెళుతుండగా స్థానిక మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద తన ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయి ప్రమాదానికి గురి అయ్యాడు. ఈ ప్రమాదంలో తనకు తీవ్ర గాయాలు అయ్యాయి అని తీవ్ర గాయాలు అయిన శ్రీనివాస్ ను మంచిర్యాలకు తరలించి వైద్యం అందిస్తున్నట్లు స్థానిక ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్ తెలిపారు.

# ఇద్దరు నిందితుల అరెస్ట్



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: వ్యక్తిని దూషించి దాడి చేసిన ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు కొత్తగూడెం టూటౌన్ సీఐ డి. ప్రతాప్ తెలిపారు. బుధవారం నిందితులను విలేకరుల ఎదుట హాజరుపరిచి వివరాలు వెల్లడించారు. గత మార్చి 20వ తేదీన రాత్రి 11:40 గంటల సమయంలో కట్ట శ్రీనివాస్, నేరేడుమల్లి నవదీప్ అను వ్యక్తులు కృషి విజ్ఞాన కేంద్రం వెళ్లే దారిలో కల్వర్టు వద్ద బొల్లి కార్తీక్ అనే అతడితో డబ్బులు విషయంలో గొడవపడ్డారు. కర్రలతో బొల్లి కార్తీక్‌పై దాడి చేయగా బలమైన గాయమైంది. 22వ తేదీన కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కట్ట శ్రీనివాస్, నేరేడుమల్లి నవదీప్, ఫోన్‌లో దూషించిన నేరేడుమల్లి సందీప్‌పై కేసు నమోదు చేశారు. ఆ కేసులో నిందితులైన కట్ట శ్రీనివాస్, నేరేడుమల్లి నవదీప్‌లను బుధవారం అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు సీఐ వివరించారు.


# దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీపీఎస్ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమం భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ సహకారంతో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు మహబూబాబాద్ ఎమ్మెల్యే డా" భూక్య మురళి నాయక్ పాల్గొని దివ్యాంగులకు అవసరమైన పరికరాలను స్వయంగా వారి చేతుల మీదుగా అందజేశారు.ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ దివ్యాంగుల జీవితం సులభతరం కావడానికి అవసరమైన ట్రై సైకిళ్ళు, వీల్ చైర్లు,వాకింగ్ స్టిక్స్,మరియు శ్రావణ యంత్రాలు లబ్ధిదారులకు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు..అంతే కాకుండా ప్రభుత్వ ప్రభుత్వ సంక్షేమ పథకాలను దివ్యాంగులకు మరియు అణగారినా వర్గాలకు చేరవేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు...వారికి సమాజంలో సమాన అవకాశాలు కల్పించడంలో ఇటువంటి పరికరాలు ఎంతో దోహదపడుతుందని ఆయన అన్నారు.అంతేకాకుండా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో విద్య మరియు సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని నిరుపేదలకు,దివ్యాంగులకు అందుబాటులో ఉండడమే తమ ప్రధాన బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గూగులోత్ జ్యోతి రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సత్యనారాయణ,స్థానిక వార్డు కౌన్సిలర్ కాటా భాస్కర్, వివిధ వార్డుల కౌన్సిలర్ లు జిల్లా నాయకులు , పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి

**– సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ఫార్మసీ రక్షణ, ప్రజా ఆరోగ్యం పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా చేపట్టిన మెడికల్ షాపుల బంద్‌లో భాగంగా కొత్తగూడెం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గణేష్ టెంపుల్ ఏరియాలో నిరసన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ నిరసన శిబిరాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా సందర్శించి, బంద్‌కు తమ పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల వల్లే నేడు మెడికల్ షాపుల యజమానులు రోడ్లెక్కి వచ్చి పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ఫార్మసీల వల్ల స్థానిక చిన్న వ్యాపారుల జీవనోపాధి దెబ్బతినడమే కాకుండా, నకిలీ మందుల సరఫరా పెరిగి ప్రజారోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా ఉన్న చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఫార్మసీ రంగాన్ని, చిన్న వ్యాపారులను కాపాడుకోవడానికి దేశవ్యాప్తంగా సాగుతున్న ఈ పోరాటం ఎంతో న్యాయమైనదని పేర్కొన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి మెడికల్ అసోసియేషన్ డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

# ఆన్‌లైన్‌లో నిషేధించిన మందుల అక్రమ విక్రయాలను ప్రభుత్వం వెంటనే అరికట్టాలి

* **మేడ్చల్ జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు యరమాద హరి నారాయణ డిమాండ్**




కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ నిషేధించిన మందులు కూడా ఆన్‌లైన్‌లో సులభంగా లభిస్తున్నాయని, అక్రమ విక్రయాలను ప్రభుత్వం వెంటనే అరికట్టాలని మేడ్చల్ జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు యరమాద హరినారాయణ డిమాండ్ చేశారు. ఆన్లైన్ లో మందుల విక్రయాలను వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ది తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్ బుధవారం విజయవంతం అయ్యింది. మేడ్చల్ జిల్లా మొత్తం సుమారు నాలుగు వేల మెడికల్ షాపులు, కుత్బుల్లాపూర్ మండల్ లోని దాదాపు 700 మెడికల్ షాపులు స్వచ్ఛందంగా బంద్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్లైన్ ఫార్మసీల వల్ల సాంప్రదాయ రిటైల్ ఔషధ రంగానికి జరుగుతున్న భారీ నష్టాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం మేడ్చల్ జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు యరమాద హరి నారాయణ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

# చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులు అను అంశంపై శిక్షణా 3వ రోజు విజయవంతం




కూసుమంచి, ప్రజా స్ఫూర్తి : మత్స్య పరిశోధన స్థానం, పాలేరు, పి.వి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయము హైదరాబాదు వారి ఆధ్వర్యంలో, మత్స్య శాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదు వారి సహకారంతో, భారతీయ వ్యవసాయ మరియు పరిశోధన మండలి,న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో,తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్ మరియు షెడ్యూల్డ్ క్యాస్ట్ మత్స్య కారులకు జరుగుతున్న జలాశయాలలో చేపల పెంపకం మరియు యాజమాన్య పద్ధతులు అను అంశంపై 3 రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం 3వ రోజు విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, నాగర్ కర్నూల్,వరంగల్ మరియు ఖమ్మం జిల్లాల నుంచి 25 మంది మత్స్య కారులు హాజరైనారు.ఈరోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ పి. శివ ప్రసాద్, ఖమ్మం జిల్లా మత్స్య శాఖ అధికారి వారు మాట్లాడుతూ తెలంగాణ మత్స్యకారులు మరియు మత్స్య రైతులు ఆక్వాకల్చర్ రంగంలో ముందుకు రాణించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సబ్సిడీ పథకాలతో పాటు బ్యాంకులలో రైతులకు ఉండే వివిధ పథకాలు మరియు లోన్లను కూడా ఉపయోగించుకొని ఆక్వా రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని కోరారు.డాక్టర్ ఎం. శ్యాం ప్రసాద్ సీనియర్ మత్స్య శాస్త్రవేత్త మరియు అధిపతి మత్స్య పరిశోధన స్థానం పాలేరు వారు మాట్లాడుతూ జలాశయాలలో చేపల పెంపకం మరియు యాజమాన్య పద్ధతుల మీద ఇక్కడ నేర్చుకున్న ప్రతి విషయాన్ని మన తెలంగాణ మత్స్య రైతులు ఆచరణలో పెట్టి మంచి లాభాలని పొందాలని కోరారు అలాగే ఇక్కడ నేర్చుకున్న ప్రతి అంశాన్ని మీ తోటి సహచరులకు మిత్రులకు కూడా తెలియపరచాలని కోరారు.శ్రీ పి. శాంతన్న , పిహెచ్డి స్కాలర్, ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ వారు మాట్లాడుతూ దడి మరియు పంజరపు చేపల పెంపకంలో పాటించవలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి మత్స్యకారులకు క్లుప్తంగా వివరించారు. సిగ నాగరాజు యంగ్ ప్రొఫెషనల్, మత్స్య పరిశోధన స్థానం పాలేరువారు మాట్లాడుతూ చెరువులలో చేపలకు సర్వసాధారణంగా వ్యాప్తి చెందే వ్యాధుల గురించి మరియు వాటి నివారణ మార్గాల గురించి తెలంగాణ మత్స్య రైతులకు క్లుప్తంగా వివరించారు. బానోతు దివ్య, యంగ్ ప్రొఫెషనల్, మత్స్య పరిశోధన స్థానం పాలేరు వారు మాట్లాడుతూ నాస్పాడ్ రిపోర్ట్ ఫిష్ డిసీజ్ యాప్ యొక్క విశిష్టతను తెలుపుతూ ఆ యాప్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలియజేశారు మరియు యాప్ ని డౌన్లోడ్ చేపించి చేపల వ్యాధులను ఎలా నివారించాలో క్లుప్తంగా వివరించారు. చివరిగా ప్రశంస పత్రాలను తెలంగాణ మత్స్యకారులకు అందించారు.

# గోరీలపాడు తండాలో హత్యాయత్నం కలకలం

* **కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గోరీలపాడు తండాలో జరిగిన హత్యాయత్న ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామానికి చెందిన బానోత్ వీరన్న (45)పై గుర్తుతెలియని పరిస్థితుల్లో కత్తితో దాడి జరగడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.పోలీసుల కథనం ప్రకారం, వీరన్నకు మునిగేపల్లి గ్రామానికి చెందిన రాంబాబుతో గత కొంతకాలంగా పరిచయం ఉంది. రాంబాబు తరచూ వీరన్న ఇంటికి వచ్చి వెళ్లేవాడని, ఈ క్రమంలో అతనికి వీరన్న భార్య రుక్కమ్మతో సాన్నిహిత్యం పెరిగిందనే అనుమానాలతో కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.19వ తేదీ రాత్రి కూడా ఇదే విషయమై ఇంట్లో తీవ్ర వాగ్వాదం జరిగినట్లు సమాచారం. అనంతరం అర్ధరాత్రి సమయంలో వీరన్నపై కత్తితో దాడి జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఘటన తర్వాత రక్తపు మడుగులో పడి ఉన్న వీరన్నను కుటుంబ సభ్యులు ఉదయం గమనించి వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ ఘటనపై బానోత్ వాసు నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూసుమంచి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఘటన అనంతరం రుక్కమ్మ, రాంబాబు ఇద్దరూ కనిపించకుండా పోవడంతో వారిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం వారి కోసం ప్రత్యేక గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.గ్రామంలో ఈ ఘటన చర్చనీయాంశంగా మారగా,కుటుంబ విభేదాలు తీవ్ర రూపం దాల్చి హత్యాయత్నానికి దారితీసినట్లు స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు గ్రామంలో పరిస్థితిని పరిశీలిస్తూ ఆధారాలు సేకరిస్తున్నారు.

# ప్రతి ఊరిలో పార్టీ జెండా పాతేద్దాం

* **టిఆర్ఎస్ శ్రేణులకు సీమల రమేష్ కురుమ పిలుపు**
* **షాద్ నగర్‌లో ఘనంగా ప్రారంభమైన పార్టీ జెండా పండుగ కార్యక్రమాలు**



ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్ : తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్ఠం చేయడమే లక్ష్యంగా, ప్రతి ఊరిలో పార్టీ జెండాను ఎగురవేయాలని షాద్ నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ సీమల రమేష్ కురుమ పిలుపునిచ్చారు. షాద్ నగర్ నియోజకవర్గంలో బుధవారం టిఆర్ఎస్ శ్రేణులు జెండా పండుగ కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించాయి. బుధవారం షాద్ నగర్ పట్టణ కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందు పార్టీ జెండా దిమ్మే పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రక్షణ సేన పార్టీ షాద్ నగర్ నియోజకవర్గం ఇంచార్జ్ సీమల రమేష్ కురుమ ముఖ్య అతిథిగా హాజరై సీనియర్ నాయకులు రంగన్నగౌడ్ తదితర నేతలతో కలిసి పార్టీ జెండా దిమ్మే పనులను ప్రారంభించి, మే 20 నుండి జూన్ 20 వరకు నెల రోజుల పాటు ఈ జెండా పండుగ కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన ప్రకటించారు.ఈ సందర్భంగా సీమల రమేష్ కురుమ మాట్లాడుతూ పార్టీ అధినేత్రి కవిత పిలుపు మేరకు ప్రతి ఊరిలోనూ టిఆర్ఎస్ జెండా రెపరెపలాడాలని ఆకాంక్షించారు. కవిత అడుగుజాడల్లో నడుస్తూ, ఆమె ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. మన నియోజకవర్గంలోని చౌదరిగూడ వేదికగానే కవితక్కా పార్టీ మొదటి జెండాను ఆవిష్కరించారన్నారు. అదే సభ ద్వారా ప్రజలకు చేయబోయే ప్రతి హామీని ఆమె స్పష్టంగా వివరించారన్నారు. కవితక్కా ఆశయాలు ఎంతో గొప్పవని, తెలంగాణ రాష్ట్ర ప్రజల అభ్యున్నతి, సర్వతోముఖాభివృద్ధి కేవలం కవితక్కా నాయకత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి, ప్రతి గడపకూ టిఆర్ఎస్ ఆశయాలు, ఆకాంక్షలు తెలిసేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగానే నేడు ఈ జెండా పండుగను ప్రారంభించామని చెప్పారు. వచ్చే నెల రోజుల పాటు నియోజకవర్గంలోని ప్రతి వాడలోనూ, ప్రతి పల్లెలోనూ పార్టీ జెండాలను పండగ వాతావరణంలో ఎగురవేసి, పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎల్.శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, సుధాకర్ గౌడ్, మహిళ నాయకురాలు అర్చన, ఉమేష్ గౌడ్, ఇమామ్, అంగోత్ సునీత, దిలీప్ కుమార్, శంకర్, ముత్యాలు, శైలజ, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అదృశ్యమైన గల్ఫ్ కార్మికుడి కేసులో చొరవ చూపిన టీజీడబ్ల్యూడబ్ల్యూసీ




ప్రజాస్ఫూర్తి , జన్నారం : అబుదాబి విమానాశ్రయం నుంచి ఇంటికి తిరిగివస్తూ అదృశ్యమైన తెలంగాణ కార్మికుడి కేసులో తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ( టీజీడబ్ల్యూడబ్ల్యూసి) చూపిన చొరవ అభినందనీయమని ప్రముఖులు కొనియాడారు.కుమార్తె వివాహానంతరం అప్పులతో, మెరుగైన జీవనం కోసం 26జూలై2026న యూఏఈ అబుదాబికి వెళ్లిన నిర్మల్ జిల్లా, కడం మండలం, కొత్త మద్దిపడగ కు చెందిన మోకెనాపెల్లి రాజా తిరిగి వచ్చే క్రమంలో విమానాశ్రయం నుంచి అదృశ్యమయ్యారు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం అందలేదు.ఈ విషయంపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలజీ శ్రీనివాస్ ఫిర్యాదుతో దుబాయ్ శాఖ అధ్యక్షులు ఎరుకల రాజమౌళి గౌడ్‌కు సమాచారం చేరవేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కల్లేడ భూమయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు అమరగొండ తిరుపతి, జన్నారం మండల ప్రధాన కార్యదర్శి దుమ్మల ఎల్లయ్య చొరవతో కీలక సమాచారం సేకరించారు. కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అలీమ్ బాధిత కుటుంబాన్ని హైదరాబాద్‌లోని ప్రజావాణి కేంద్రానికి తీసుకెళ్లారు.గల్ఫ్ కార్మికుల యోగక్షేమాల కోసం సమితి చూపుతున్న దృఢ సంకల్పాన్ని నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజావాణి ఎన్నారై సెల్ ఆధ్వర్యంలో మహమ్మద్ అలీమ్‌ను ఘనంగా సత్కరించారు.ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' హెల్ప్ డెస్క్ లైజన్ అధికారి భార్గవి నద్దునూరి, వాలంటీర్లు మహ్మద్ బషీర్ అహ్మద్, కర్రి పద్మారాణి, భవాని తదితరులు పాల్గొన్నారు.

# జగద్గిరి నగర్ లో నీటి కొరత ను వెంటనే పరిష్కరించాలి

* **కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ జె కె శేఖర్ యాదవ్**

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : జగద్గిరి నగర్ లో నీటి కొరత చాలా ఎక్కువ ఉందని వెంటనే పరిష్కరించాలని కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ జె కె శేఖర్ యాదవ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స ఎలక్ట్రికల్ డిజిఎం సందీప్ కుమార్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగద్గిరిగుట్ట గుట్ట లాస్ బస్టాప్ కమాన్ వద్ద ఉన్న బోరు గత సంవత్సరం నుండి రిపేర్ లో ఉంది దాన్ని వెంటనే బాగు చేసి నూతన బోరు మోటర్ బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షులు జగన్ ముదిరాజ్ వరలక్ష్మి అభిషేక్ రెడ్డి శంకర్ పంతులు రేణుక లింగమ్మ విజయ రెడ్డి మమత తదితరులు పాల్గొన్నారు,



# అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే జిల్లా యంత్రాంగం ముఖ్య లక్ష్యం

* **రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**



రంగారెడ్డి జిల్లా, ప్రజాస్ఫూర్తి : ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే జిల్లా యంత్రాంగం , రాజకీయ పార్టీల ముఖ్య లక్ష్యం కావాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు.బుధవారం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జిల్లా యంత్రాంగం అత్యంత పారదర్శకంగా, ఖచ్చితమైన విచారణతో బాధ్యతాయుతంగా పని చేస్తుందని స్పష్టం చేశారు. రాజకీయ నాయకులు సైతం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసం ప్రతి రాజకీయ పార్టీ తక్షణమే తమ బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి, ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని, అధికారులతో రాజకీయ నాయకులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. జూన్ 15 నుండి బూత్ స్థాయి అధికారులకు పూర్తిస్థాయి శిక్షణ, బిఎల్ఓలచే ఇంటింటి సమగ్ర విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, జాబితా ప్రక్షాళనలో బూత్ స్థాయి అధికారుల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. బీఎల్ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి క్షుణ్ణంగా విచారణ చేసిన అనంతరం మాత్రమే కొత్త ఓటరు నమోదు ప్రక్రియ చేపడతారని, స్థానికంగా చనిపోయిన వారి పేర్లను తొలగించడం, వలస వెళ్లిన వారిని గుర్తించడంతో పాటు అర్హులైన కొత్త ఓటరు ఎవరూ కూడా జాబితాలో చేర్చే బాధ్యత బీఎల్ఓలపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండే ప్రతి యువతీ, యువకుడు తప్పనిసరిగా ఫామ్ 6 ద్వారా కొత్త ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఓటర్ల జాబితాలో తప్పుల సవరణలు, మార్పులు, చేర్పుల కోసం ఫామ్ 8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒక దృఢమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు నమోదు ప్రక్రియలో సహకరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే 'ప్రత్యేక సమగ్ర సవరణ' ప్రక్రియ, 'బూత్ స్థాయి ఏజెంట్ల' నియామకం, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు బహుళ అంతస్తుల , ఎత్తైన భవనాల్లో నివసించే ఓటర్లకు ప్రస్తుతం వారి నివాసాలకు దూరంగా ఉన్న వేర్వేరు పోలింగ్ కేంద్రాలను కేటాయించినందున, అటువంటి భవనాల్లోనే కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల దృష్ట్యా, ఓటర్ల జాబితా నుండి నకిలీ నమోదులను తొలగించాలని , మరణించిన ఓటర్ల పేర్లను తొలగించాలని కోరారు. సంబంధిత 'ఎన్నికల నమోదు అధికారులకు' ఆదేశాలు జారీ చేసి, 'బూత్ స్థాయి అధికారుల' ఖాళీలు ఏర్పడిన వెంటనే వాటిని తక్షణమే భర్తీ చేసేలా చూడాలని కోరారు. ఒకే ఇంటి నంబరు కింద 50 మందికి పైగా ఓటర్లు ఉన్న గృహాలను గుర్తించి, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఆ కేసులను పరిశీలించి, అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకునేలా సంబంధిత ఈఆర్ఓలకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సర్ 2002 ఓటర్ల జాబితా నకళ్లను అన్ని రాజకీయ పార్టీలకు అందజేయాలని కోరారు.సర్ ప్రక్రియ ప్రారంభానికి ముందే, రాజకీయ పార్టీల భాగస్వామ్యంతో బీఎల్ఓలు, బీఎల్ఓ పర్యవేక్షకులు బీఎల్ఎలకు సరైన శిక్షణ నిర్వహించాలని కోరారు. ఓటర్ల గణన పత్రాలను ఏదేని అనధికార వ్యక్తికి గుంపుగా కాకుండా, కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగానే పంపిణీ చేయాలని ఈఆర్ఓ లందరికీ ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఓటర్ల గణన పత్రాల డేటా ఎంట్రీ (దత్తాంశ నమోదు) సమయంలో, నిర్దేశిత విధానాన్ని కచ్చితంగా పాటించాలని సూచించారు.డేటా ఎంట్రీ ప్రక్రియలో ఎటువంటి లోపాలు లేకుండా, పారదర్శకత , కచ్చితత్వాన్ని పాటించేలా చూడాలని కోరారు. జీహెచ్ఎంసీ పరిధిలోకి వచ్చే పోలింగ్ కేంద్రాల వివరాలను నియోజకవర్గాల వారీగా అందజేయాలని కోరారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు చేసిన సూచనలు , విజ్ఞప్తులను, ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా పరిశీలిస్తామని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈసీఐ మార్గదర్శకాల ప్రకారం, ఓటర్ల జాబితా నుండి నకిలీ , మరణించిన ఓటర్ల పేర్లను తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటర్ల జాబితా శుద్ధీకరణ నిమిత్తం ఈఆర్ఓ లందరికీ తదనుగుణంగా ఆదేశాలు జారీ చేయబడతాయి. తెలంగాణ/రంగారెడ్డి జిల్లాలో జరగబోయే సర్ (సంక్షిప్త సవరణ కార్యక్రమం), ఎన్నికల సంఘం (ఈసీ ) జారీ చేసిన షెడ్యూల్ , మార్గదర్శకాలకు కట్టుబడి కచ్చితంగా నిర్వహించబడుతుందని డీఈఓ, కలెక్టర్ హామీ ఇచ్చారు. జీహెచ్ఎంసీ పరిధిలోకి వచ్చే పోలింగ్ కేంద్రాల నియోజకవర్గాల వారీ వివరాలు, అలాగే పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్ఓ లు , బీఎల్ఓ పర్యవేక్షకుల వివరాలను సంబంధిత ఈఆర్ఓల నుండి సేకరించిన అనంతరం, రాజకీయ పార్టీలతో పంచుకోవడం జరుగుతుందని రాజకీయ పార్టీల ప్రతినిధులందరికీ తెలియజేశారు. ఈ సమావేశంలో మర్రి శశిధర్ రెడ్డి, (బీజేపీ), అంబోజీశ్రీనివాస్, (బిజెపి), కొప్పుల నర్సింహా రెడ్డి, (బీజేపీ), వానిపల్లి శ్రీనివాస్ రెడ్డి, (బీజేపీ), తులసిముఖేష్ ముదిరాజ్, (బిజెపి),సరికొండ దుర్గేష్, బీఆర్ఎస్,ఈ. ఆర్. యాదయ్య, బీఆర్ఎస్, వి.నవీన్ కుమార్, బీఆర్ఎస్, పి.ధర్మ రెడ్డి, బీఆర్ఎస్, జిల్లా రెవెన్యూ అధికారి శారద, ఆర్డీఓలు అనంత్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సరిత, ఎలక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పిజెఆర్ ఆనవాళ్ళ తొలగింపు పై అభిమానుల ఆగ్రహం

- దిగివచ్చిన ఇంటి నిర్మాణ యజమాని
- తిరిగి శిలాఫలకం ఏర్పాటు చేస్తానని హామీ
- ప్రజాస్ఫూర్తి కథనానికి స్పందన






(కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి నియోజకవర్గంలోని వసంత నగర్ లో పిజెఆర్ ఆనవాళ్ళ తొలగింపు పై ఆయన అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాలన్ని తొలగించడం పట్ల మండిపడ్డారు. తన భవనానికి అడ్డు వస్తుందని శిలాఫలకాన్ని తొలగించిన నిర్మాణం వద్ద బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ప్రజాస్ఫూర్తి దినపత్రికలో "వసంత నగర్ లో మాయమైన శిలాఫలకం" "మాయమైన నాటి పీజేఆర్ ఆదవాళ్లు" అనే శీర్షికతో ప్రత్యేక కథనాన్ని ప్రచురించడం జరిగింది. 2007 వ సంవత్సరంలో రూ. 66 లక్షల వ్యయం తో వసంతనగర్ లో బిటి రోడ్డు నిర్మాణానికి సూచికగా నాటి ఎంఎల్ఏ పీజెఆర్ పేరిట శిలాఫలకం ఏర్పాటు చేశారు. తాజాగా అదే ప్రాంతంలో ఓ భవన నిర్మాణం చేపట్టారు. దానికి అడ్డుగా శిలాఫలకం ఉండటం తో దానిని నిర్మాణదారుడు తొలగించాడు. ఇదే విషయాన్ని ప్రజాస్ఫూర్తి ప్రత్యేక కథనంగా ప్రచురించింది. ఇందుకు స్పందించిన పిజెఆర్ అభిమానులు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు పి నాగిరెడ్డి, నాయకులు దేశాల్, సతీష్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు దిగి వచ్చిన నిర్మాణదారుడు తిరిగి శిలాఫలకాన్ని అక్కడే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చాడు. పిజెఆర్ ఆనవాళ్లు తొలగిస్తే ఊరుకోబోమని నాయకులు హెచ్చరించారు.

*** అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి**

సదరు భవన నిర్మాణానికి సాధారణ అనుమతి తీసుకొని కమర్షియల్ గా షేటర్ లు వేయడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవన అక్రమ నిర్మాణం పట్ల మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# జూన్ 2న కొత్త పింఛన్లు

- 2 లక్షల మందికి పంపిణీ
- అర్హుల జాబితాలు సిద్ధం చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు


హైదరాబాద్: రాష్ట్రావతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 2న చేయూత పథకం కింద కొత్త పింఛన్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాల వారీగా అర్హుల జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బుధవారం కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో 42 లక్షల మంది పెన్షనర్లు ఉండగా.. మూడేళ్లుగా కొత్త పింఛన్లు మంజూరు కావడం లేదు. చనిపోయిన వారి స్థానంలో వారి భార్యలకు మాత్రమే పెన్షన్లు ఇస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మంది కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకొని నిరీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మార్చిలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో 2 లక్షల కొత్త పింఛన్లు మంజూరు చేసింది. వీటిని జూన్ 2న పంపిణీ చేసేందుకు నిర్ణయించింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) బుధవారం అర్హుల జాబితాలు రూపొందించి పంపించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసింది. సెర్ప్ రాష్ట్రవ్యాప్తంగా పెన్షనర్ల వివరాలను ముఖగుర్తింపు (ఫేషియల్ రికగ్నిషన్) యాప్‌లో నమోదు చేస్తోంది. మరణించిన వారు, వలసవెళ్లిన వారు, జీవించి ఉన్న వారి (లైవ్‌నెస్ అథెంటికేషన్) వివరాలతో జాబితాను సిద్ధం చేస్తోంది. ఈ ప్రక్రియ నెలాఖరుతో పూర్తయ్యే వీలుంది. ఆ తర్వాత గ్రామ, వార్డు సభలు నిర్వహించి, మృతుల వివరాలను వెల్లడించి తొలగించేందుకు తీర్మానం చేస్తారు.

## వాటర్ బాటిల్స్‌లో రూ. 3 కోట్ల గంజాయి.. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సీజ్









హైదరాబాద్ : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయి స్మగ్లర్లు సరికొత్తగా వాటర్ బాటిల్స్‌లో తరలిస్తూ డీఆర్ఐ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తుల నుంచి 8.705 కిలోల హైడ్రోఫోనిక్ గంజాయిని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇద్దరు ప్రయాణికులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో వాటర్ బాటిల్స్, ఆలూ చిప్స్ డబ్బాల్లో తరలిస్తున్న 24 ప్యాకెట్లను గుర్తించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 3.05 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు స్పష్టం చేశారు. అనంతరం ప్రయాణికులిద్దరిని శంషాబాద్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## నా కొడుకును నేనే పోలీసులకు అప్పగించాను : బండి సంజయ్



హైదరాబాద్ : పోక్సో కేసులో నా కొడుకును నేనే పోలీసులకు అప్పగించాను అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. కోర్టులో కేసు నడుస్తుంది.. విచారణ జరిగి నిజాలు బయటకు రావాలన్నారు. బండి సంజయ్ బుధవారం మీడియాతో మాట్లాడారు.

**కుమారుడి అరెస్టుపై సంజయ్ వ్యాఖ్యలు ఇలా..**

'కోర్టు పరిధిలో ఉంది.. కన్నకొడుకును ఓ తండ్రి పోలీసులకు స్వయంగా అప్పగించినటువంటి సందర్భం ఏదైనా ఉందా..? ఇవాళ కన్న కొడుకును నేను తీసుకెళ్లి విచారణకు సహకరించాలని అప్పజెప్పినా. కేసీఆర్ కొడుకు కేటీఆర్ ఫేక్ మీడియా ఫ్యాక్టరీ నడుపుతున్నాడు.. ఏం జరుగుతది.. ఏం జరగాలి.. ఏం జరిపించాలనేది ఆ కుట్రలన్నీ ఆయన్నే చేస్తున్నడు కాబట్టి ఆయనను అడిగితే సమాధానం చెప్తడు' అని బండి సంజయ్ పేర్కొన్నారు.

## బీసీలు ఎదగడం మోదీకి ఇష్టం లేదు : వీహెచ్



హైదరాబాద్ : బీసీలు ఎదగడం ప్రధాని నరేంద్ర మోదీకి ఇష్టం లేదని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వీ హహనుమంతరావు పేర్కొన్నారు. జనగణనలో కులగణన చేయాలన్న సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. జ్యుడిషియరీ జిందాబాద్.. సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమైనది అని పేర్కొన్న వీహెచ్.. న్యాయవ్యవస్థకు ధన్యవాదాలు తెలిపారు. 60 కోట్ల ప్రజలకు న్యాయం చేసిన జస్టిస్ సూర్యకాంత్‌కి రుణపడి ఉంటామని ఆయన అన్నారు. కులగణన చేయాలని రాహుల్ గాంధీ ఆలోచన చేశారు. దానికనుగుణంగానే రేవంత్ ప్రభుత్వం కులగణన చేసింది. బీసీలు ఎదగడం మోదీ ప్రభుత్వానికి ఇష్టం ఉండదు. మోదీ మాకు సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. మాకు అన్ని విషయాలు తెలుసు. 18వ శతాబ్దంలోనే జ్యోతిరావ్ పూలే మాకు అన్ని నేర్పాడని వీ హనుమంతరావు తెలిపారు.

## మోదీ నేపథ్యం.. కాంగ్రెస్‌కు ఎప్పుడూ కంటగింపే : ఎన్ రామచందర్ రావు



హైదరాబాద్ : ప్రధాని నరేంద్ర మోదీ సామాన్య నేపథ్యం కాంగ్రెస్ నాయకత్వానికి ఎప్పుడూ కంటగింపుగానే ఉంటుందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు అన్నారు. ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ ఉపయోగించిన అవమానకరమైన భాష అత్యంత దురదృష్టకరం, తీవ్రంగా ఖండించదగినది అని ఆయన పేర్కొన్నారు. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చి.. అంకితభావం, కఠోర శ్రమ, నిస్వార్థ సేవతో దేశాన్ని నడిపిస్తున్న ఒక గొప్ప నాయకుడిని ఏమాత్రం జీర్ణించుకోలేని ఆ పార్టీ మానసిక స్థితికి ఇది అద్దం పడుతోంది అని రామచందర్ రావు మండిపడ్డారు. రాహుల్ గాంధీ వాడిన పదాలు కాంగ్రెస్ నాయకత్వం యొక్క సంస్కృతిని, వారి అహంకారాన్ని బట్టబయలు చేస్తున్నాయి. మోదీ ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చారని, వెనుకబడిన వర్గానికి (OBC) చెందినవారనే ఒకే ఒక్క కారణంతో కాంగ్రెస్ నేతలు పదేపదే ఆయనను అవమానిస్తున్నారు. గత 12 ఏళ్లుగా.. గ్రామాలు, పేదలు, రైతులు, కార్మికులు, పీడిత, అణగారిన వర్గాల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నో చారిత్రాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అందుకే 140 కోట్ల మంది భారతీయులు ఆయన నాయకత్వంపై అచంచలమైన విశ్వాసాన్ని, నమ్మకాన్ని ఉంచుతున్నారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ప్రధాని మోదీని ఎంతగా అవమానిస్తే, భారతదేశ ప్రజలు ఆయనకు అంత బలంగా అండగా నిలుస్తారు. ఆ పార్టీ అహంకారాన్ని ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా పదేపదే తిప్పికొడుతూనే ఉంటారని రామచందర్ రావు స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు దేశ అత్యున్నత రాజ్యాంగ పదవి గౌరవాన్ని మంటగలపడమే కాకుండా, 140 కోట్ల మంది పౌరుల మనోభావాలను దెబ్బతీశాయి. భారత ప్రజాస్వామ్య విలువల పట్ల వారికున్న అగౌరవాన్ని ప్రదర్శించాయి. బాధ్యతారాహిత్యమైన, ఆమోదయోగ్యం కాని ఈ వ్యాఖ్యలకు గాను రాహుల్ గాంధీ దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు డిమాండ్ చేశారు.

## అత్తాపూర్‌లో యువతి కిడ్నాప్.. ఆరాంఘర్ వరకు వెంబడించిన పోలీసులు..!



హైదరాబాద్: నగర పరిధిలోని అత్తాపూర్‌లో ఓ యువతిని మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు కిడ్నాప్ చేసిన సంగతి తెలిసిందే. థార్ కారులో వచ్చిన దుండగులు ఆమెను బలవంతంగా కిడ్నాప్ చేసినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో కారు ఆచూకీతో పాటు యువతి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు యత్నిస్తున్నారు.

*** ఆరాంఘర్ వరకు వెంబడించిన పోలీసులు..**

యువతిని కిడ్నాప్ చేస్తున్న సమయంలో స్థానికులు 100కు డయల్ చేయగా, పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. యువతిని తీసుకెళ్తున్న కారును పోలీసులు వెంబడించారు. ఆరాంఘర్ వరకు వెళ్లినా కూడా కారు కనిపించలేదు. పోలీసుల కళ్లుగప్పి దుండగులు పారిపోయారు. అయితే కారుకు నంబర్ ప్లేట్ లేకపోవడంతో.. దాని ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులకు కాస్త ఇబ్బందిగా మారింది.

**కిడ్నాపా..? మరేదైనా కారణమా..?**

యువతి కిడ్నాప్‌పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆమెను నిజంగానే కిడ్నాప్ చేశారా..? లేక మరేదైనా కారణం ఉందా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కిడ్నాప్‌కు గురైన యువతిపై ఇప్పటి వరకు ఎవరు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు. ఈ ఘటనను చూసిన స్థానికులు మాత్రం ఆ యువతిని థార్ కారులో బలవంతంగా ఎక్కించుకుని వెళ్లారని చెబుతున్నారు. దుండగులకు ఆ యువతి ముందే తెలిసినట్లు ఉందని పేర్కొన్నారు. ఈ ఘటన ప్రస్తుతం నగరంలో కలకలం సృష్టిస్తోంది.

## జర్మన్ భాష, ఏఐ నైపుణ్యాలతో యువతకు విదేశాల్లో అవకాశాలు: మంత్రి వివేక్




హైదరాబాద్: తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వివేక్ (Minister Vivek) అన్నారు. టామ్‌కామ్‌ను (TOMCOM) మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని, దీనికోసం బడ్జెట్‌లో రూ.90 కోట్లు కేటాయించిందని తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడలో భారత్-యూరోపియన్ యూనియన్ మొబిలిటీపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో మంత్రి వివేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టామ్‌కామ్ ఒక అద్భుతమైన సంస్థగా ఎదిగిందన్నారు. టామ్‌కామ్ ద్వారా శిక్షణ పొందిన యువత విదేశాల్లో మంచి ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా జర్మన్ భాష నేర్చుకున్న వారికి యూరోపియన్ దేశాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

**ఏఐ కీలకపాత్ర..**

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషిస్తోందని, ఏఐతో పోటీ పడగల నైపుణ్యాలను యువత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా శిక్షణ తీసుకుంటేనే ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని చెప్పారు. ఈ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ ద్వారా యూరోప్ దేశాల్లో ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి అవకాశాలపై తెలంగాణ యువతకు స్పష్టమైన అవగాహన కలుగుతుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్లోబల్ ఎడ్యుకేషన్, ఇంటర్నేషనల్ స్కిల్ మొబిలిటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు.

**డిమాండ్‌కు అనుగుణంగా..**

జర్మనీ సహా పలు యూరోపియన్ దేశాల్లో పెరుగుతున్న నైపుణ్యాల డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్ర యువతను సిద్ధం చేయడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. భారత్-ఈయూ మధ్య వలసలు, ఉపాధి అవకాశాలపై జరిగిన చర్చలు యువత భవిష్యత్తుకు ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## సరస్వతి అంత్య పుష్కరాలకు సర్వంసిద్ధం భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు



**: మంత్రి కొండా సురేఖ**



హైదరాబాద్ : సరస్వతి అంత్య పుష్కరాలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 21 నుంచి జూన్ 1 వరకు 12 రోజుల పాటు అంత్యపుష్కరాలు జరుగనున్నాయి. గురువారం ఉదయం 5.43 గంటలకు కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ తొలి స్నానం ఆచరించిన అనంతరం పుష్కరాలు ప్రారంభమవుతాయి. దీనికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలి రోజు రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా పుష్కర స్నానం ఆచరించనున్నారు. గతేడాది సరస్వతి పుష్కరాలు జరిగిన విషయం తెలిసిందే.

**ఏర్పాట్లు ఇలా..**

అంత్య పుష్కరాల సందర్భంగా జ్ఞానసరస్వతి పుష్కర ఘాట్, వీఐపీ ఘాట్ వద్ద ప్రత్యేక సెట్టింగ్స్ చేశారు.. సౌండ్స్ అండ్ లైటింగ్, ప్రత్యేక డెకరేషన్ చేశారు. వీఐపీ భక్తుల కోసం 40 ఆధునిక గుడారాలతో టెంట్ సిటీ నిర్మించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ డిపోల నుండి 3,360 బస్సు సర్వీసులు ఆర్టీసీ నడుపుతున్నది. 2500 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

**ప్రత్యేక హోమాలు..**

అంత్య పుష్కరాలు జరిగే 12 రోజులు వివిధ ప్రాంతాల నుంచి స్వామిజీలు, పీఠాదిపతులు రానున్నారు.. ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నారు. మొదటిరోజు 21న మహా గణపతి హోమం, 22న సుబ్రహ్మణ్య షాడాక్షరీ హోమం, 23న హయగ్రీవ హోమం, 24న నవగ్రహ హోమం, 25న మహా మృత్యుజయ హోమం, 26న దుర్గా సూక్త హోమం, 27న మహా సుదర్శన హోమం, 28న వేద దక్షిణామూర్తి హోమం, 29న స్వయంవర పార్వతి హోమం, 30న ధన్వంతరి హోమం, మే 31న మహారుద్ర హోమం, జూన్ 1వ తేదీన లఘు చండీ మహా పూర్ణాహుతి ఉంటుంది.

**భక్తులకు ఇబ్బంది కలగకుండా..**

సరస్వతి అంత్యపుష్కరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి ఆలయంలో కంచి పీఠాధిపతి విజయేంద్రస్వామితో కలిసి కొండ సురేఖ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం బయట మాట్లాడుతూ.. ఈ అంత్య పుష్కరాలకు రూ. 200 కోట్లకు పైగా నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. రోజుకు ఒక స్వామీజీ స్నానంతో ఈ పుష్కరాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం గోదావరి హారతి ఇస్తారని చెప్పారు.

## రాష్ట్రంలో 25 వేలకు పైగా మెడికల్ షాపులు బంద్.. వాటికి మినహాయింపు




హైదరాబాద్ : ఆన్‌లైన్ అమ్మకాలకు నిరసనగా దేశవ్యాప్తంగా మెడికల్ షాపులు మూతపడ్డాయి. కార్పొరేట్ కంపెనీలు ఇచ్చే డిస్కౌంట్లు, ఆన్ అమ్మకాలతో చిన్న ఔషధ దుకాణాలపై తీవ్ర ప్రభావం పడుతున్నదని, వాటిని నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్, డ్రగ్గిస్ట్ ఒక్కరోజు సమ్మెకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 25 వేలకు పైగా మెడికల్ షాపులు బంద్‌ను పాటిస్తున్నాయి. ఒక్క హైదరాబాద్‌లోనే 12 వేలకుపైగా ఔషధ దుకాణాలు తెరచుకోలేదు. అయితే దవాఖానలకు అనుబంధంగా ఉన్న మెడికల్ షాపులకు బంద్ నుంచి మినహాయింపు ఇచ్చారు. బంద్ విషయంలో ప్రజలు ఆందోళన చెందవద్దని డీసీఏ ప్రకటించింది. అన్ని ప్రభుత్వ, కార్పొరేట్, ప్రైవేట్ హాస్పిటళ్లలో మెడికల్ దుకాణాలు యధావిధిగా పనిచేస్తున్నాయి. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, నిమ్స్‌లో మెడికల్ దుకాణాలు తెరిచి ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు. అదేవిధంగా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాల్లో ఫార్మసీలు తెరిచే ఉంటాయని వైద్యాధికారులు తెలిపారు.

## జనగణనలో కులగణన.. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: పీసీసీ చీఫ్




హైదరాబాద్ : జనగణన ప్రక్రియలో కులగణన కూడా చేపట్టాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని సామాజిక, ఆర్థిక అసమానతలను సరిచేయడానికి కుల గణన అత్యంత అవసరమని కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశవ్యాప్తంగా కుల గణన అవసరాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారని, సామాజిక న్యాయం సాధనకు కుల గణన కీలకమని స్పష్టం చేశారని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలకు వారి జనాభా ప్రాతిపదికన న్యాయం జరగాలంటే సమగ్ర కుల గణన తప్పనిసరి అని కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో చేపట్టిన కుల సర్వే విజయవంతమైందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించిన ఈ సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సంక్షేమ ఫలాల సరైన పంపిణీ కోసం కుల గణన ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. తెలంగాణలో చేపట్టిన కుల సర్వే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా సమగ్ర కుల గణన నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# విజయ్‌కు మొదలైన తలనొప్పులు.. ఆ ఎమ్మెల్యేలకు క్యాబినెట్‌లో చోటుపై టీవీకే క్లారిటీ!

తమిళనాడులో మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన టీవీకే చీఫ్ విజయ్‌కు తలనొప్పులు మొదలయ్యాయి. అన్నాడీఎంకే తిరుగుబాటు ఎమ్మెల్యేలను మంత్రివర్గంలో చేర్చుకుంటారంటూ వచ్చిన వార్తలు కాస్త గందరగోళానికి దారితీశాయి. ఈ వ్యవహారంపై తాజాగా టీవీకే నుంచి స్పష్టత వచ్చింది. ఇంతకీ ఏం జరిగిందంటే..? తమిళనాడులో విజయ్ సారథ్యంలో ప్రభుత్వం కొనసాగడంలో కాంగ్రెస్, వీసీకే, లెఫ్ట్ పార్టీలతో పాటు అన్నాడీఎంకే తిరుగుబాటు ఎమ్మెల్యేల మద్దతు కూడా ఉంది. కాగా.. ఈ రెబల్ నేతలకు క్యాబినెట్ బెర్తులు కేటాయిస్తారంటూ కొన్ని వార్తలు చక్కర్లుకొట్టాయి. ఈ నేపథ్యంలో వీసీకే నేత తిరుమావళవన్ స్పందిస్తూ.. ఆ ఎమ్మెల్యేలకు క్యాబినెట్ బెర్తులు కేటాయిస్తే, తమ మద్దతు అంశంపై పునరాలోచించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వామపక్షాల నుంచి కూడా



ఇలాంటి స్పందనే వచ్చింది. అన్నాడీఎంకేలోని ఏ వర్గాన్ని ప్రభుత్వంలో చేర్చుకున్నా ప్రజల తీర్పునకు అది విరుద్ధమే అవుతుందని మిత్రపక్షాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో తమిళనాడు మంత్రి అధవ్ అర్జున స్పందించారు. “ఈ విషయమై మేం మిత్రపక్షాలతో మాట్లాడి ఒక నిర్ణయానికి వచ్చాం. అన్నాడీఎంకే తిరుగుబాటు ఎమ్మెల్యేలు క్యాబినెట్‌లో చేరతారనే వార్తలు కేవలం ఊహాగానాలు మాత్రమే’’ అని స్పష్టం చేశారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకేకు 108 సీట్లు రాగా.. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీల మద్దతుతో విజయ్ తమిళనాడు సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అసెంబ్లీలో బలపరీక్ష నిరూపణ సమయంలో అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించడంతో విజయ్ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న ఎమ్మెల్యేల సంఖ్య 144కి పెరిగింది.

## పూరీ రథాల తయారీలో.. 70 రకాల మేకులు

పూరీ: విశ్వప్రసిద్ధ పూరీ జగన్నాథుని రథయాత్ర సమీపిస్తున్న నేపథ్యంలో మూడు రథాల తయారీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఒక్కో రథంలో 70 రకాలకుపైగా ఇనుప మేకులను ఉపయోగిస్తారట. మొత్తం నాలుగు టన్నులకుపైగా మేకులు, ఇతర విడిభాగాలు అవసరమవుతాయట. వీటిని జగన్నాథ ఆలయ సమీపంలోని దోలవేది వద్ద ఓఝా సేవకులు (కమ్మరులు) తయారు చేస్తారు. 52 రోజుల పాటు నిరంతరాయంగా వీటి తయారీలో నిమగ్నమవుతారు. “మూడు అంగుళాల



నుంచి నాలుగు అడుగుల వరకు పొడవు ఉండే 70 రకాలకుపైగా మేకులను తయారు చేస్తాం. పరిమాణం, వినియోగాన్ని బట్టి వాటికి వేర్వేరు పేర్లు ఉంటాయి. అత్యంత చిన్నదానిని ‘గొడిసాల్’ అని పిలుస్తారు. ఇది మూడు అంగుళాల పొడవు ఉంటుంది. నాలుగు అడుగులు ఉండే అత్యంత పెద్ద మేకును ‘జంగ’ అంటారు. ఆరా కాంటా, పందరీ కాంటా, టాగా కాంటా ఇలా రకరకాల మేకులు ఉంటాయి’’ అని మహరణ సేవాయత్‌లలో ఒకరైన అర్జున్ మహారాణా తెలిపారు. ఈ ఏడాది జులై 16న రథయాత్ర ప్రారంభం కానుంది.

## ‘రైళ్లలో వరుస అగ్నిప్రమాదాల వెనుక అసాంఘిక శక్తులు’

దిల్లీ: దేశంలో ఇటీవల జరిగిన రైలు అగ్నిప్రమాదాల వెనుక అసాంఘిక శక్తుల ప్రమేయం ఉందని రైల్వేశాఖ పేర్కొంది. తమ అంతర్గత దర్యాప్తులో ఈ విషయం బయటపడిందని తెలిపింది. ఇవి ప్రమాదవశాత్తూ జరిగిన ఘటనలు కావని పేర్కొంది. ఇటీవల రాజస్థాన్‌లోని అమర్‌పుర, కోటా, బిహార్‌లోని ససరాం, బెంగాల్‌లోని హౌరాలో నాలుగు వేర్వేరు రైళ్లలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలపై రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌తో దర్యాప్తు నిర్వహించగా.. పలు కీలక విషయాలు బయటపడినట్లు రైల్వే శాఖ వెల్లడించింది. అమరపుర ఘటనలో బెడ్డింగ్ మెటీరియల్‌కు నిప్పు పెట్టినట్లు దర్యాప్తులో తేలిందని రైల్వేశాఖ పేర్కొంది. హౌరా ఘటనలో పెట్రోల్‌లో ముంచిన క్లాత్‌ను బోగీ బాత్‌రూమ్‌లో



తగలబెట్టినట్లు గుర్తించినట్లు వెల్లడించింది. కోటాలోని రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలులో సైతం బాత్‌రూమ్ నుంచే మంటలు మొదలైనట్లు గుర్తించామని పేర్కొంది. ససరాంలో ఖాళీ బోగీలో గుర్తుతెలియని వ్యక్తి మండే వస్తువును విసిరినట్లు దర్యాప్తులో తేలిందని తెలిపింది. రైళ్లలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా వెంటనే రైల్వే హెల్ప్‌లైన్ 139కి ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేసింది. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, వారి భద్రతకు రైల్వేశాఖ కట్టుబడి ఉందని తెలిపింది.



## 21 ట్రాక్టర్‌లతో పెళ్లి ఊరేగింపు..

ఝున్‌ఝును: పెళ్లి ఊరేగింపు కోసం సాధారణంగా వరుడు కార్లలోనే, గుర్రంపైనో వస్తుంటాడు. రాజస్థాన్‌కు చెందిన ఓ కుటుంబం మాత్రం ఏకంగా 21 ట్రాక్టర్‌లతో పెళ్లి ఊరేగింపు నిర్వహించింది. ధాని ప్రాంతానికి చెందిన ఓ వరుడు 21 ట్రాక్టర్‌లతో ఊరేగింపులో పాల్గొన్నాడు. అందులో ఒక ట్రాక్టర్‌ను వరుడే స్వయంగా నడుపుతూ రావడం అందరి దృష్టిని ఆకర్షించింది. దీనిపై వరుడు జితేంద్ర మాట్లాడుతూ.. తమది వ్యవసాయాధారిత కుటుంబమని పేర్కొన్నారు. గతంలో తమ తాతముత్తాల వివాహ ఊరేగింపునకు ట్రాక్టర్‌లనే వినియోగించినట్లు వారు చెప్పే వారని..దీంతో తాను కూడా తన కార్లతో కాకుండా ట్రాక్టర్‌లతో నిర్వహించాలని అనుకున్నట్లు తెలిపారు. చిన్ననాటి నుంచి తన జీవితంలో భాగమైన ట్రాక్టర్‌లోనే తన జీవిత భాగస్వామిని తమ ఇంటికి తీసుకువెళ్తున్నానని సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రధానిపై రాహుల్ విమర్శలు.. తిప్పికొట్టిన భాజపా..

ప్రధాని నరేంద్ర మోదీ ఐరోపా దేశాల పర్యటనలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఆర్థిక సంక్షోభం వల్ల దేశ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రధాని మాత్రం ఇటలీలో చాక్లెట్లు పంచుతూ బిజీగా ఉన్నారని దుయ్యబట్టారు. ఇటువంటి చర్యలు నాయకత్వం అనిపించుకోవని..ఓ జిమ్మిక్కు మాత్రమేనని అన్నారు. ప్రధాని మోదీ పిలుపునిచ్చిన పొదుపు చర్యలను ఆయనే పాటించడం లేదని విమర్శించారు.



పశ్చిమాసియా సంక్షోభం ఇలాగే కొనసాగితే దేశంలో గ్యాస్, ఎరువులు, ఇంధనాల సరఫరా పూర్తిగా ఆగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ పర్యటనలో భాగంగా ఇటలీ వెళ్లిన మోదీ ఆ దేశ ప్రధాని మెలోనికి ‘మెలోడి’ చాక్లెట్లు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

* **పాక్ చేతిలో కీలుబొమ్మగా రాహుల్...**

ప్రధానిపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను భాజపా అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా తిప్పికొట్టారు. ఆయన చేసే వ్యాఖ్యల వెనుక పాక్ హస్తం ఉందని..అక్కడి నేతలు చెప్పినట్లుగా ఆయన మాట్లాడతారని విమర్శించారు. ప్రధానిని అగౌరవపరచడం అతనికి అలవాటుగా మారిపోయిందన్నారు.

### టెట్రా ప్యాక్‌లో వోడ్కా...
## కేంద్రానికి సుప్రీం నోటీసులు

టెట్రా ప్యాకెట్లు, సాచెట్లలో వోడ్కా విక్రయాలపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎవరూ గుర్తించలేని విధంగా అలాంటి ప్యాకేజీల్లో మద్యం అమ్మకంపై నిషేధం విధించాలని అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. అలాంటి ప్యాకేజీలు వినియోగదారులను తప్పుదారి పట్టించి, మైనర్లను మద్యపానం వైపు ప్రోత్సహించే అవకాశం ఉందని పిటిషనర్ ఆందోళన వ్యక్తంచేశారు . కమ్యూనిటీ అగైనెస్ట్ డ్రంకెన్ డ్రైవింగ్ అనే సంస్థ ఈ పిటిషన్ వేసింది. ఆ సంస్థ తరఫున లాయర్ విపిన్ నాయర్ వాదనలు వినిపించారు. “అలాంటి అనేక మద్యం ఉత్పత్తుల ప్యాకింగ్‌పై



సరైన హెచ్చరికలు ఉండటం లేదు. అవి పండ్ల రసాలను పోలి ఉండేవిధంగా ప్యాక్ చేస్తున్న సందర్భాలున్నాయి. అలాంటి ప్యాకేజింగ్‌లో మద్యం అమ్మకాలను నిషేధిస్తూ.. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఒకే విధమైన విధానాన్ని రూపొందించేలా ఆదేశాలు ఇవ్వాలి’’ అని కోరారు. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అభ్యర్థనను పరిశీలించింది. ఈ ప్యాకింగ్ తప్పుదోవ పట్టించే విధంగా ఉందంటూ కేంద్రం, రాష్ట్రాల్లోని ఎక్సైజ్ విభాగాలకు నోటీసులు జారీ చేసింది. నవంబర్ 2025లో కూడా టెట్రా ప్యాక్‌లలో పెరుగుతోన్న మద్యం అమ్మకాల గురించి సుప్రీం ఆందోళన వ్యక్తంచేసింది.


## జన గణనలో కులగణన వద్దంటూ ‘పిల్’ కొట్టేసిన సుప్రీంకోర్టు

దిల్లీ: జన గణనలో కుల గణన మినహాయించేలా ఆదేశాలు ఇవ్వాలన్న పిల్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఏజెన్సీలు కులగణన సమాచరాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని సర్వోన్నత న్యాయస్థానంలో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. పిల్‌పై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం... పిటిషన్ కొట్టివేస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. “జనగణన కుల ప్రాతిపదికన ఉండాలా? వద్దా? అనేది విధానపరమైన నిర్ణయం. వెనుకబడిన తరగతుల జనాభా ఎంత ఉందో ప్రభుత్వం తెలుసుకోవాలి కదా. ఇది.. విధానపరమైన విషయం.. ఇందులో జోక్యం చేసుకోవడానికి కారణం కనిపించడంలేదు’’ అంటూ పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది.


# ప్రొటీన్లతో అలసట మాయం!



**ఉదయాన్నే నిద్ర లేచింది మొదలు.. ఊపిరి సలపని పనులతో క్షణం తీరిక ఉండదు. మరోవైపు ఆఫీసులో ఒత్తిడి, అలసటతో సతమతమవుతాం. ఇలాంటి బిజీ లైఫ్‌స్టైల్‌తో ఎదురయ్యే అలసటను దూరం చేసుకొని చురుగ్గా మారాలంటే ప్రొటీన్లు నిండిన ఆహార పదార్థాలను రోజువారీ డైట్‌లో చేర్చుకోవాలని చెబుతున్నారు నిపుణులు.**







**నట్స్**

ప్రొటీన్లతో నిండిన బాదంపప్పు, పిస్తా, అక్రోట్.. వంటి గింజలను ప్రతిరోజూ మితంగా తీసుకోవడం మంచిది. అవి గుండెకు మేలు చేస్తాయట. సలాడ్లు, ఉడికించిన కూరగాయలతో కూడా వీటిని కలుపుకొని తినొచ్చు. అయితే నట్స్‌లో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.

**పాలు, పాల పదార్థాలు**

కండరాల నిర్మాణానికి తోడ్పడే ప్రొటీన్లు పాలు, పాల పదార్థాల్లో పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటు అదుపులో ఉంచడానికీ తోడ్పడతాయట. ఈ క్రమంలో తక్కువ కొవ్వులుండే పాల పదార్థాలను తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

**సోయాబీన్స్**

సోయాబీన్స్‌లో ప్రొటీన్ల మోతాదు ఎక్కువ. వీటిని సోయా పాలు, సోయా పేస్ట్, టోఫూ రూపంలోనూ తీసుకోవచ్చు. అయితే ఇవి కొంతమందికి పడకపోవచ్చు. అలాంటి వారు వీటిని తీసుకునే విషయంలో వైద్యులను సంప్రదించాలి.

**ఇవి కూడా!**

* బఠాణీలు, రాజ్మా, బీన్స్, చిక్కుళ్లు, ఇతర కూరగాయల్లోనూ ప్రొటీన్ ఉంటుంది.
* చేపల్లో ప్రొటీన్లతో పాటు గుండెకు మేలు చేసే ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలూ ఎక్కువగానే ఉంటాయి.
* మాంసాహారంలోనూ ప్రొటీన్లు మెండుగా ఉంటాయి. అయితే వీటిలో కొవ్వులు కూడా ఎక్కువగా ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవాలంటున్నారు నిపుణులు.
* కోడిగుడ్డులో కూడా ప్రొటీన్ ఉంటుంది. కానీ కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్న వారు, గుండెజబ్బులు.. వంటి సమస్యలున్న వారు డాక్టర్ సలహా తీసుకున్న తర్వాతే వీటిని ఆహారంలో చేర్చుకోవాలి.





## హెచ్‌డీఎఫ్‌సీ ఉద్యోగులకు..
# రెండు రోజుల వర్క్ ఫ్రమ్ హోం

అంతర్జాతీయ ముడి చమురు సంక్షోభం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ.. పొదుపు మంత్రం పాటించాలని, కార్పొరేట్ సంస్థలు వర్క్ ఫ్రం హోమ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ ఆ దిశగా అడుగులు వేస్తోంది. కస్టమర్లతో నేరుగా సంబంధం లేని వ్యాపార, కార్పొరేట్ బ్యాంకింగ్‌లకు సంబంధించిన ఉద్యోగులకు వారంలో రెండు రోజులు వర్క్ ఫ్రం హోం ప్రకటించింది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని, నెల రోజుల పాటు ప్రయోగాత్మకంగా పరిశీలిస్తామని వెల్లడించింది. ఆ తర్వాత సంస్థ పనితీరును సమీక్షించి ఈ విధానం ముమ్మందు కొనసాగించాలా? లేదా? అనే నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. బ్యాంకులో అంతర్గత విభాగాలైన ట్రెజరీ ఆపరేషన్స్, బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ బ్యాంకింగ్, హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్, ఫైనాన్స్ అకౌంట్స్ వంటి ఉద్యోగులకు మాత్రమే ఈ వర్క్ ఫ్రం హోం వర్తిస్తుంది. బ్యాంకు కస్టమర్లతో నేరుగా సంబంధం ఉండే ఉద్యోగుల విధులు యథావిధిగా కొనసాగుతాయని హెచ్‌డీఎఫ్‌సీ తెలిపింది. వర్క్ ఫ్రం హోం వల్ల వినియోగదారులకు బ్యాంకు సేవల్లో ఎలాంటి అంతరాయం ఉండదని పేర్కొంది.

# పన్ను ఆదా ఎఫ్‌డీల వడ్డీ రేట్లు ఇవే..

అనేక బ్యాంకులు పన్ను ఆదా ఫిక్స్‌డ్ డిపాజిట్ల సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. ఈ డిపాజిట్లు ఆదాయపు పన్ను చట్టం, 1961లోని సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాలను అందిస్తాయి. ఈ ఎఫ్‌డీలు సాధారణ ఫిక్స్‌డ్ డిపాజిట్ల మాదిరిగానే ఉంటాయి. ఈ ఎఫ్‌డీల్లో డిపాజిట్ చేసిన మొత్తానికి సెక్షన్ 80సీ కింద రూ.1.50 లక్షల వరకు మినహాయింపు పొందొచ్చు. ఈ డిపాజిట్ల లాక్‌ఇన్ పీరియడ్ 5 సంవత్సరాలు. ఈ కాలవ్యవధి లోపు డిపాజిట్‌ను ఉపసంహరించడానికి వీలుండదు. వీటిపై రుణాన్ని కూడా పొందలేరు. కనీస పెట్టుబడి రూ.1,000 నుంచి మొదలవుతుంది. ఈ డిపాజిట్లపై వడ్డీ రేట్లు బ్యాంకును బట్టి మారుతుంటాయి. సీనియర్ సిటిజన్లు కింది



పట్టికలో తెలిపిన వడ్డీ రేట్ల కంటే 0.50% వరకు అదనపు వడ్డీని అందుకుంటారు.

# ఉద్యోగుల తొలగింపునకు ఏఐ సాకు: గూగుల్ డీప్‌మైండ్ సీఈవో

కృత్రిమ మేధ ప్రతి రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. టెక్ ప్రపంచంలో సంచలనాలు సృష్టిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విస్తరణ వల్ల భవిష్యత్‌లో తీవ్ర ఉద్యోగ సంక్షోభం పొంచిఉందని పలువురు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో ఏఐ వినియోగంపై గూగుల్ డీప్‌మైండ్ సీఈవో డెమిస్ హిస్సాబిస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐని ఉత్పత్తి పెంచుకోవడానికి వాడుకోవాలే కానీ, ఉద్యోగుల తొలగింపు కోసం కాదని స్పష్టం



చేశారు. సరైన ముందుచూపు లేకనే పలు టెక్ సంస్థలు వేలాదిమంది ఉద్యోగులను తొలగిస్తున్నారని వ్యాఖ్యానించారు. గూగుల్ I/O కార్యక్రమంలో గూగుల్ డీప్‌మైండ్ సీఈవో క్లిష్టమైన కోడింగ్‌లను అభివృద్ధి చేసే జెమిని 3.5 ఫ్లాష్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇలాంటి కొత్త మోడళ్లను అభివృద్ధి చేయడం అంటే కోడింగ్ చేసే ఉద్యోగుల అవసరం తగ్గుతుందని అర్థం కాదని అన్నారు. ఉద్యోగులను తొలగించడానికి చాలా టెక్ కంపెనీలు ఏఐని ఓ సాకుగా వాడుకుంటున్నాయేమోనని అనుమానం వ్యక్తం చేశారు. దీనిని 'ఏఐ వాషింగ్'గా అభివర్ణించారు. కేవలం ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం ద్వారా ఖర్చులు ఆదా చేయడం కంటే.. తమకు ఉత్పాదకతే ముఖ్యమని పేర్కొన్నారు. కోడింగ్‌లో ఏఐ (AI) మరింత మెరుగైతే.. తన కంపెనీలోని ఇంజినీర్లతో మరిన్ని కొత్త ప్రాజెక్టులు చేయించే అవకాశం ఉంటుందని గూగుల్ డీప్‌మైండ్ సీఈవో పేర్కొన్నారు. ముందుచూపు లేకపోవడం వల్లే డెవలపర్ల స్థానంలో ఏఐని తీసుకురావాలని పలు కంపెనీలు ప్రయత్నిస్తున్నాయని అభిప్రాయం వ్యక్తంచేశారు.

# వర్క్‌ఫ్రమ్ హోమ్ అని చెప్పి.. లేఆఫ్ మెయిల్స్


ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా (Meta)లో ఉద్యోగ తొలగింపులు ప్రారంభమయ్యాయి. సంస్థ తొలుత తమ ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోమ్ చేయాలని చెప్పి.. సడన్‌గా లేఆఫ్ మెయిల్స్ పంపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ విషయం నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సింగపూర్, యూఎస్, యూకే వంటి ప్రాంతాల్లోని ఉద్యోగులకు తొలుత ఇంటినుంచే పని (Work From Home) చేయాలని కంపెనీ తెలిపింది. అందుకు వారు సిద్ధమవుతుండగా.. సరిగ్గా తెల్లవారుజామున ప్రభావిత ఉద్యోగులకు లేఆఫ్ (Lays Off) మెయిల్స్ పంపింది. ఎలాంటి గందరగోళం జరగకుండా ఉండేందుకు సంస్థ ఇలాంటి చర్యలు తీసుకున్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ చర్యపై నెట్టింట తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక, మెటా తన సింగపూర్‌లోని టీమ్‌కు తొలుత ఈ మెయిల్స్ పంపించింది. ఉదయం 4 గంటలకు (భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున 1:30 గంటలకు) వారికి అవి అందాయి. ఈ తొలగింపులకు ముందు ప్రపంచవ్యాప్తంగా మెటాలో దాదాపు 78 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. తాజాగా 10 శాతం అంటే..



దాదాపు 8,000 మందిని ఉద్యోగం నుంచి తొలగించనుంది. ఇందులో ఎక్కువగా ఇంజినీరింగ్, ప్రొడక్ట్ బృందాలు ప్రభావం కానున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఈ ఏడాది చివర్లో కంపెనీ మరికొన్ని తొలగింపులు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. 7వేల మందిని ఏఐ విధుల్లోకి మార్చనున్నట్లు మెటా హెచ్‌ఆర్ చీఫ్ జానెల్లె గేల్ ఇప్పటికే తెలిపారు.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. చివరి గంటలో కోలుకున్నాయి. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. దీంతో ఓ దశలో 600కు పైగా పాయింట్ల నష్టాలను చవిచూసిన నిఫ్టీ లాభాల్లో ముగియడం గమనార్హం. ఆసియా మార్కెట్‌లు చాలా వరకు నష్టాల్లో ముగియగా.. యూరోపియన్ మార్కెట్‌లు లాభాల్లో ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 74,806.49 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,200.85) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,529.41 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని



తాకింది. చివర్లో కోలుకుని 117.54 పాయింట్ల లాభంతో 75,318.39 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 41 పాయింట్ల లాభంతో 23,659 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.83గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్, ఇండిగో, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి. బీఈఎల్, టెక్ మహీంద్రా, ఎటెర్నల్, టాటా స్టీల్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 109 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4491 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# 'ఆకాశ్.. ఇప్పుడు ఆ చీటీ ఎక్కడ?': సునీల్ గావస్కర్

రాజస్థాన్ రాయల్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లో ఎల్ఎస్‌జీ పేసర్ మూడు ఓవర్లు వేసి 54 పరుగులు ఇచ్చి ఒక వికెట్ మాత్రమే పడగొట్టాడు. అయితే, ఇదే బౌలర్ చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌లో అదరగొట్టాడు. (3/26)తో తన స్పెల్‌ను ముగించాడు. ఆ మ్యాచ్‌లో రుతురాజ్ గైక్వాడ్, సంజు శాంసన్‌ను ఔట్ చేసిన ఆనందంలో ఆకాశ్ ప్రదర్శించిన హావభావాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. తన జేబులోంచి ఓ చీటీని తీసి బ్యాటర్లకు చూపిస్తూ సెలబ్రేషన్స్ చేసుకున్నాడు. ఆ చీటీపై 'అక్కీ ఆన్ ఫైర్.. ఆకాశ్‌కు టీ20 మ్యాచ్‌లో వికెట్లు ఎలా తీయాలో తెలుసు' అని రాసి ఉంది. రాజస్థాన్‌తో మ్యాచ్‌లో ఆకాశ్ బౌలింగ్‌లో బ్యాటర్లు ఎడాపెడా బౌండరీలు బాదారు. దీంతో సునీల్ గావస్కర్ కామెంటేటరీ చేస్తున్న సమయంలో ఆ బౌలర్ సెలబ్రేషన్స్‌ను ఎగతాళి చేశాడు. 'ఆకాశ్.. ఇప్పుడు ఆ చీటీ ఎక్కడ ఉంది? జేబులోనే ఉంది కదా? ఒక ఓవర్‌కు ఆరు బంతులు ఉంటాయి. అందులో బహుశా మీకు ఒక్క బంతికి మాత్రమే వికెట్ దొరకవచ్చు. మిగిలిన ఐదు బంతుల్లో బౌండరీలు వస్తాయి. ఇతను 17 బంతుల్లోనే 48 పరుగులు సమర్పించుకున్నాడు'' అని గావస్కర్ పేర్కొన్నాడు. ఐపీఎల్‌లో ఆటగాళ్లు తమ జేబులోంచి నోట్ తీసి సంబరాలు చేసుకునే ట్రెండ్‌ని సన్‌రైజర్స్ బ్యాటర్ అభిషేక్ శర్మ మొదలుపెట్టాడు. ఈ సీజన్‌లో సీఎస్కే ఆటగాడు ఉర్విల్ పటేల్, ముంబయి బౌలర్ రఘుశర్మ



ఇదేవిధంగా సంబరాలు చేసుకుని వార్తల్లో నిలిచారు. ఈ స్టైల్‌లో సెలబ్రేషన్స్ చేసుకోవడాన్ని డేల్ స్టెయిన్, అంబటి రాయుడు, మిచెల్ మెక్‌క్లెనగన్ వంటి మాజీ క్రికెటర్స్ తప్పుబట్టారు.




# హాకీ ప్లేయర్లు మా ట్రైనింగ్ సెషన్స్ చూస్తే నవ్వుకుంటారు: కోహ్లి

భారత హాకీ ఆటగాళ్ల ఫిట్‌నెస్‌లో టీమ్‌ఇండియా క్రికెటర్ల ఫిట్‌నెస్ కనీసం 15 శాతం కూడా ఉండదని స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి అన్నాడు. బెంగళూరులో జరిగిన 'ఆర్సీబీ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియన్ స్పోర్ట్స్ సమ్మిట్'లో కోహ్లి పాల్గొని మాట్లాడాడు. మన దేశంలో క్రికెట్‌పైనే ఎక్కువ దృష్టి పెట్టడం వల్ల ఇతర క్రీడలను మనం పట్టించుకోవడం లేదని అభిప్రాయపడ్డాడు. కానీ, హాకీ ప్లేయర్ల శారీరక సామర్థ్యం, కఠోర శ్రమ అసాధారణమైనవని కోహ్లి కొనియాడాడు. ''ప్రజలు కొన్నిసార్లు ఫిట్‌నెస్‌ను ఒక అసాధారణమైన విషయంగా చూస్తారని నాకు తెలుసు. కానీ, అది అథ్లెట్లకు తప్పనిసరిగా అవసరమని నేను భావిస్తాను. ఫిట్‌నెస్ అనేది ఒక సాధారణ విషయంగా ఉండాలి. దాన్నో పెద్ద విషయంగా చూడొద్దు. మన దేశంలో క్రికెట్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఉండటం వల్ల ఇతర క్రీడలను పట్టించుకోం. నిజాయితీగా చెప్పాలంటే ఒక భారత హాకీ ఆటగాడి



ఫిట్‌నెస్‌లో మాది 15 శాతం కూడా ఉండదు. ఒకవేళ హాకీ ప్లేయర్లు మా ట్రైనింగ్ సెషన్స్ చూస్తే నవ్వుకుంటారు. ఎందుకంటే వారు హాకీ ఆడాలంటే ఇంతకంటే చాలా ఎక్కువ సమయం కష్టపడాలి'' అని కోహ్లి పేర్కొన్నాడు. విరాట్ తమ ఫిట్‌నెస్‌పై ప్రశంసలు కురిపించడంపై భారత హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ హర్షం వ్యక్తం చేశాడు. కోహ్లి లాంటి ఆటగాడి నోట ఈ మాటలు తమకు మరింత ప్రేరణ ఇస్తాయన్నాడు.

# వైభవ్ ఆటను ఊహించుకుంటేనే భయంగా ఉంది
## : లఖ్‌నవూ కోచ్

వైభవ్ సూర్యవంశీపై లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కోచ్ జస్టిన్ లాంగర్ ప్రశంసలు కురిపించాడు. ఈ కుర్రాడిని క్రికెట్ దిగ్గజం సర్ డాన్ బ్రాడ్‌మన్‌తో పోల్చాడు. లఖ్‌నవూతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో సూర్యవంశీ 38 బంతుల్లోనే 93 పరుగులు చేసి రాజస్థాన్ విజయంలో కీలకపాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్ అనంతరం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో జస్టిన్ లాంగర్ మాట్లాడాడు. మిచెల్ స్టార్క్, ఆన్రిచ్ నోకియా వంటి ప్రపంచస్థాయి బౌలర్లు కూడా వైభవ్‌కు ఎలా బౌలింగ్‌లో చేయాలో తెలియక గందరగోళానికి గురవుతున్నారని పేర్కొన్నాడు. చిన్న వయసులోనే



ఈ స్థాయిలో చెలరేగితే తన నైపుణ్యాన్ని మరింత మెరుగుపర్చుకుంటే వైభవ్ ఏ స్థాయిలో ఆడతాడో ఊహించుకుంటేనే భయంగా ఉందన్నాడు. ఇండియా 'ఏ' తరఫున కూడా వైభవ్ ఆస్ట్రేలియాలో రాణించాడని, ఇతను డాన్ బ్రాడ్‌మన్‌లా పరిస్థితులను వేగంగా ఆకళింపు చేసుకొంటాడని లాంగర్ పేర్కొన్నాడు.

**జట్టుగా మేం గర్వపడుతున్నాం: పంత్**

రాజస్థాన్‌తో మ్యాచ్‌లో ఓటమి అనంతరం లఖ్‌నవూ కెప్టెన్ రిషభ్ పంత్ మాట్లాడాడు. తాము మరో 10 పరుగులు చేసిఉంటే ఫలితం వేరేలా ఉండేదని అభిప్రాయపడ్డాడు. మిడిల్ ఓవర్లలో, ఆఖరి ఓవర్‌లో జోఫ్రా ఆర్చర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడని పంత్ పేర్కొన్నాడు. షమీ లేని లోటు తమకు స్పష్టంగా కనిపించిందన్నాడు. ప్రస్తుతం మా పరిస్థితి ఎలా ఉన్నా.. జట్టుగా గర్వపడుతున్నామని పేర్కొన్నాడు. జట్టుగా, వ్యక్తిగతంగా తగినంత ఆత్మవిశ్వాసంతో ఉన్నామని, అయితే ఈసారి ఫలితాలు తమకు అనుకూలంగా రాలేదని పంత్ వివరించాడు.

# భారత టీ20 కెప్టెన్ రేసులో శ్రేయస్ అయ్యర్: రికీ పాంటింగ్

భారత టీ20 జట్టు తదుపరి కెప్టెన్ రేసుపై పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కేవలం జట్టులోకి పునరాగమనం చేయడమే కాకుండా.. సూర్యకుమార్ యాదవ్ తర్వాత భారత టీ20 జట్టుకు కెప్టెన్ అయ్యే అన్ని అర్హతలూ ఉన్నాయని పాంటింగ్ మద్దతు ప్రకటించాడు.

**రేసులో అయ్యర్**


భారత టీ20 కెప్టెన్సీ రేసులో శ్రేయస్ అయ్యర్ ముందున్నాడని రికీ పాంటింగ్ స్పష్టం చేశాడు. ఐపీఎల్ టోర్నీ ప్రారంభంలో అయ్యర్ ఎంతటి నాణ్యమైన ఆటగాడో అందరం చూశామని గుర్తు చేశారు. ప్రస్తుతం మైదానం, వెలుపలా అతడు ఉన్న స్థితిని బట్టి చూస్తే కెప్టెన్సీకి సరైన ఎంపికగా కనిపిస్తున్నాడని అభిప్రాయపడ్డాడు.

**ఆటలో పరిణతి**

అయ్యర్ తన కెరీర్‌లో మునుపెన్నడూ లేనంత పరిణతి చెందిన ఆటగాడిగా మారాడని పాంటింగ్ కొనియాడాడు. ప్రస్తుతం అతడు తన ఆటపై పూర్తి నియంత్రణతో ఉన్నాడని చెప్పాడు. ఐపీఎల్ లాంటి సుదీర్ఘమైన లీగ్‌లో 14 మ్యాచ్‌ల పాటు ఒకే రకమైన స్థిరత్వాన్ని కొనసాగించడం ఎవరికైనా కష్టమేనని, వ్యక్తిగతంగానూ, జట్టుగానూ హెచ్చుతగ్గులు రావడం సహజమేనని అయ్యర్ ఇటీవలి పేలవ ఫామ్‌ను సమర్థించాడు.

**తిరిగి పుంజుకుంటాడు**

పంజాబ్ కింగ్స్ వరుస ఓటములతో ఇబ్బంది పడుతున్నప్పటికీ.. లక్నోతో జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో అయ్యర్ కచ్చితంగా పుంజుకుంటాడని పాంటింగ్ ధీమా వ్యక్తం చేశాడు. ఆఖరి మ్యాచ్‌లో అయ్యర్ నిలబడి భారీ స్కోరు సాధిస్తే.. జట్టు విజయం సాధించే అవకాశాలు మెరుగవుతాయన్నాడు. అయ్యర్ కెప్టెన్సీ శైలి కూడా ఈ సీజన్‌లో ఎంతో



అద్భుతంగా ఉందని ప్రశంసించాడు.

**సెలక్టర్ల నిర్ణయంపై ఆశ్చర్యం**

గత కొన్నేళ్లుగా టీమ్‌ఇండియా ఎంపికలో శ్రేయస్ అయ్యర్ పేరు లేకపోవడం తనను ఎప్పుడూ ఆశ్చర్యానికి గురిచేస్తూనే ఉందని పాంటింగ్ ఓపెన్‌గా చెప్పాడు. ఈ ఐపీఎల్ ప్రదర్శన తర్వాత సెలక్టర్లు కచ్చితంగా అయ్యర్ పేరును పరిగణనలోకి తీసుకుంటారని భావిస్తున్నట్లు తెలిపాడు. కేవలం జట్టులోకి తీసుకోవడమే కాకుండా.. అతని పేరు పక్కన కెప్టెన్సీ ట్యాగ్ పెట్టడంపై కూడా ఆలోచన చేస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నాడు.

**కెప్టెన్సీకి సరైన సమయం**

భారత జట్టులోకి అంత తేలిగ్గా రీఎంట్రీ ఇవ్వలేమని, భారీగా పరుగులు సాధిస్తేనే అది సాధ్యమవుతుందని పాంటింగ్ అంగీకరించాడు. అయితే అయ్యర్ ప్రస్తుతం తన వయసు, ఆట పరంగా కెరీర్‌లోనే అత్యుత్తమ దశలో ఉన్నాడని విశ్లేషించాడు. ఒకవేళ భారత టీ20 కెప్టెన్సీ బాధ్యతలు అయ్యర్‌ను వరిస్తే.. అతడు ఆ అవకాశాన్ని వంద శాతం సద్వినియోగం చేసుకుంటాడని పాంటింగ్ ధీమా వ్యక్తం చేశాడు.

సినిమా

## మహేష్ ఫ్యామిలీ నుంచి మరో బ్యూటీ
# జాన్వీ పిక్స్ వైరల్!



హైదరాబాద్: ఘట్టమనేని కుటుంబం నుంచి మరో మూడో తరం వారసురాలు వెండితెరపైకి వచ్చేందుకు సిద్ధమవుతోంది. సూపర్ స్టార్ మహేష్ బాబు మేనకోడలు, నటిదర్శకురాలు మంజుల ఘట్టమనేని కుమార్తె జాన్వీ స్వరూప్ తాజా ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. లైట్ బ్లూ ట్యాంక్ టాప్, బ్లాక్ కార్గో ప్యాంట్స్ ధరించిన క్యాజువల్ లుక్‌లో జాన్వీ ఎంతో స్టైలిష్‌గా కనిపిస్తున్న ఫొటోలను ఆమె తల్లి మంజుల నెట్టింట పంచుకున్నారు. ఈ లుక్స్ చూసిన నెటిజన్లు, అభిమానులు 'పక్కా హీరోయిన్ మెటీరియల్' అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఘట్టమనేని కుటుంబం నుంచి ఇప్పటికే రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ సినీ ఎంట్రీకి సిద్ధమవగా.. ఇప్పుడు జాన్వీని కూడా హీరోయిన్‌గా పరిచయం చేసేందుకు మంజుల గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నట్లు ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ క్రేజీ బ్యూటీ త్వరలోనే వెండితెరపై మెరవాలని ఫ్యాన్స్ ఆకాంక్షిస్తున్నారు.



## లెహంగాలో మైమరపిస్తున్న
# నభా నటేష్!

టాలీవుడ్ చందమామ, 'ఇస్మార్ట్ శంకర్' బ్యూటీ నభా నటేష్ తన తాజా గ్లామరస్ ఫోటోషూట్‌తో సోషల్ మీడియాను ఊపేస్తోంది. వైవిధ్యమైన పాత్రలతోనే కాకుండా, తనదైన స్టైలిష్ లుక్స్‌తో ఎప్పటికప్పుడు అభిమానులను అలరించే ఈ ముద్దుగుమ్మ, తాజాగా సాంప్రదాయ లెహంగా ధరించి నెటిజన్ల మనసు దోచుకుంది. లేటెస్ట్ ఫోటోల్లో నభా నటేష్ డిజైనర్ లెహంగాలో మెరిసిపోతూ అప్సరసలా కనిపిస్తోంది. సున్నితమైన ఎంబ్రాయిడరీ వర్క్‌తో కూడిన లెహంగా, దానికి మ్యాచ్ అయ్యే జ్యువెలరీ ధరించి రాయల్ లుక్‌ను సొంతం చేసుకుంది. ముఖంలో ఆకర్షణీయమైన చిరునవ్వు, నెరజాణలాంటి హావభావాలతో ఆమె ఇచ్చిన పోజులు కుర్రకారుకు పిచ్చెక్కిస్తున్నాయి. ట్రెడిషనల్ వేర్‌లోనూ తనదైన గ్లామర్ జోడించి నభా చేసిన ఈ ఫోటోషూట్ ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతోంది. "ఈ అందానికి హద్దుల్లేవు", "పర్ఫెక్ట్ ఇండియన్ బ్యూటీ" అంటూ అభిమానులు, నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ప్రమాదం నుంచి కోలుకున్న తర్వాత సెకండ్ ఇన్నింగ్స్‌లో జోరు పెంచిన నభా.. గ్లామర్ పరంగా సరికొత్త బెంచ్‌మార్క్ సెట్ చేస్తూ, వరుస అవకాశాలతో దూసుకుపోయేందుకు సిద్ధంగా ఉన్నానని ఈ ఫోటోల ద్వారా మరోసారి నిరూపించింది.



## పెట్స్‌ను పరిచయం చేసిన ఎన్టీఆర్..
# ఫొటో వైరల్

తన పుట్టినరోజు సందర్భంగా ప్రముఖ నటుడు ఎన్టీఆర్ క్యూట్ ఫొటో పంచుకున్నారు. తాను పెంచుకుంటున్న మకావ్ పక్షులను అభిమానులకు పరిచయం చేశారు. వాటి పేర్లు అసహీ (సూర్యోదయం), యూహీ (సూర్యాస్తమయం) అని తెలిపారు. జపాన్‌పై ఉన్న ప్రేమకు ఈ పేర్లు ప్రతిబింబమని పేర్కొన్నారు. జపాన్‌లో విశేష క్రేజ్ ఉన్న తెలుగు నటుల్లో ఎన్టీఆర్ ముందుంటారనే సంగతి తెలిసిందే. కండలు తిరిగిన దేహంతో ఎన్టీఆర్ పక్షులతో దిగిన ఈ ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.

## 'ధురంధర్ 2'..
## దేశ భద్రతకు ముప్పంటూ పిల్..
# హైకోర్టు కీలక ఆదేశం

బాక్సాఫీసు వద్ద రికార్డు సృష్టించిన 'ధురంధర్ 2'కు ఇప్పుడు ఓ చిక్కు ఎదురైంది. ఈ సినిమాలో సాయుధ దళాల కార్యకలాపాల వివరాలను బహిర్గతం చేశారని, దీనివల్ల దేశ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందంటూ దిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. సశస్త్ర సీమా బల్ (SSB)లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దీపక్ కుమార్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఆ సినిమా కల్పిత కథ కావచ్చుని, కానీ భద్రతాదళ సిబ్బంది లేవనెత్తిన ఆందోళనలనూ విస్మరించలేమని వ్యాఖ్యానించింది. ఈ ఆరోపణలపై విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (CBFC)ని ఆదేశించింది. ఈ సినిమా స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన సంగతి తెలిసిందే. రణ్‌వీర్ సింగ్ హీరోగా దర్శకుడు ఆదిత్యధర్ తెరకెక్కించిన ఈ చిత్రం మార్చిలో విడుదలై, రూ.1800 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. విదేశాల్లో ఇప్పటికే 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ మూవీ.. భారత్‌లో జూన్ 5 నుంచి ఓటీటీ 'జియో హాట్‌స్టార్'లో స్ట్రీమింగ్ కానుంది. జూన్ 4న రాత్రి 7గంటలకు డిజిటల్ ప్రీమియర్ ఉండనుంది.

## పంజాబ్ గాయని హత్య..
# వెలుగులోకి కొత్త విషయాలు



పంజాబీ గాయని ఇందర్ కౌర్ (29) హత్య కేసులో తాజాగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో నిందితుడు సుఖ్వీందర్ సింగ్‌కు కెనడాలో అప్పటికే పెళ్లి అయిందని ఈ విషయం తెలిసి ఆమె పెళ్లికి నిరాకరించడం వల్లే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఇందర్ కౌర్ తిరస్కరించడంతో కక్ష పెంచుకున్న సుఖ్వీందర్, ఆమెపై పగ తీర్చుకోవడానికే కెనడా నుంచి పంజాబ్ వచ్చినట్లు కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మే 15వ తేదీన సుఖ్వీందర్ సింగ్ తన స్నేహితులతో కలిసి ఇందర్ కౌర్‌ను తుపాకీతో బెదిరించి బలవంతంగా కిడ్నాప్ చేశాడు. దీనిపై ఆమె సోదరుడు జోతిందర్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కిడ్నాప్ కేసు నమోదైంది. అయితే, కిడ్నాప్ జరిగిన ఆరు రోజుల తర్వాత లుథియానాలోని కాలువలో ఇందర్ కౌర్ మృతదేహం లభ్యమైంది. నిందితులు ఆమెను దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని కాలువలో పడేసినట్లు పోలీసులు నిర్ధరించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన అనంతరం ప్రధాన నిందితుడు సుఖ్వీందర్ సింగ్ కెనడాకు పారిపోయినట్లు అనుమానిస్తున్నారు. మరోవైపు, ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు వేగంగా స్పందించి ఉంటే తన సోదరి ప్రాణాలు దక్కేవని, పోలీసుల అలసత్వం వల్లే ఈ ఘోరం జరిగిందని ఇందర్ కౌర్ సోదరుడు ఆవేదన వ్యక్తంచేశారు.

## బాలయ్య సినిమాలో మంచు మనోజ్
# అధికారికంగా ప్రకటించిన టీమ్

అగ్ర కథానాయకుడు బాలకృష్ణ.. దర్శకుడు గోపీచంద్ మలినేని కలయికలో ఓ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. '#NBK111'గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా ఈ సినిమా టీమ్ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ చిత్రంలో నటుడు మంచు మనోజ్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని తెలుపుతూ దర్శకుడు పోస్ట్ పెట్టారు. 'మీ పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో ప్రేక్షకులు చూడడం కోసం వేచి చూస్తున్నా' అని రాశారు. ఇందులో ఆయన విలన్‌గా నటిస్తున్నట్లు తెలుస్తోంది. గతంతో బాలకృష్ణ, మంచు మనోజ్ ఇద్దరూ 'ఊ..కొడతారా ఉలిక్కిపడతారా' సినిమాలో నటించారు. ఇది రెండో చిత్రం కావడం విశేషం. హిస్టారికల్ మూవీగా తెరకెక్కుతోన్న '#NBK111'లో బాలకృష్ణ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారు. 'వీర సింహారెడ్డి' విజయం తర్వాత గోపిచంద్ మలినేని - బాలయ్య నుంచి వస్తున్న రెండో



చిత్రమిది. ఇందులో బాలకృష్ణకు జోడీగా నయనతార నటించనున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. తాజాగా నయన్ స్థానంలో కాజల్ తీసుకున్నట్లు టాలీవుడ్ టాక్. దీనిపై చిత్ర బృందం అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి సంగీతం తమన్ అందిస్తున్నారు. బాలయ్య కోసం తమన్ వర్క్ చేస్తోన్న ఆరో ప్రాజెక్ట్ ఇది. వీరిద్దరి కాంబోలో గతంలో వచ్చిన చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలు అందుకున్నాయి. దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు మనోజ్ కూడా భాగం కావడంతో అంచనాలు పెరిగాయి.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.